

రేకుల కింద వంట చేస్తున్న దృశ్యం

గురుకులంపై సమస్యల స్వారీ

కనీస వసతులకు నోచుకోక సమస్యల సుడిలో చదువుల కోవెల బిక్కుబిక్కుమంటోంది. విద్యార్థినులకు కనీసం 12 గదులు అవసరం కాగా.. ఉన్న ఆరు గదుల్లోనే తరగతులు.. హాస్టల్ అన్నింటినీ నిర్వహిస్తున్నారు. 13 సంవత్సరాలుగా కనీస వసతులకు నోచుకోక పీలేరు బాలికల గురుకులం రోదిస్తోంది. పాడుబడ్డ ఆయిల్ సీడ్స్ భవనాల్లో అరకొర వసతుల నడుమ చదువు కొనసాగిస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. ఇప్పటి వరకు ఒక్క రెగ్యులర్ పోస్టు కూడా మంజూరు కాకపోవడం శోచనీయం. ఇలా గురుకుల పాఠశాల సమస్యలపై స్పాట్ చేస్తోంది.

- అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం
- 13 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులే గతి
- రెగ్యులర్ పోస్టుల మంజూరు ఎన్నటికో....?
- ఆరు గదుల్లోనే తరగతులు, డైనింగ్, రాత్రి బస
- పాడుబడ్డ ఆయిల్ సీడ్స్ భవనాల్లోనే నిర్వహణ





పీలేరులోని బాలికల ఏపీ గురుకుల పాఠశాల, వరండాలో నిర్వహిస్తున్న తరగతులు



అవసరం మేరకు గదులు లేనందున లగేజి ఇలా...

పీలేరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని బాలికల గురుకుల పాఠశాలలో కనీస వసతులు కూడా లేవు. విద్యార్థినులు సమస్యల నడుమ తమ చదువును కొనసాగిస్తున్నారు. 2012న ఆగస్టు 27వ తేదీ అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి పీలేరు పట్టణం తిరుపతి మార్గంలో మూతపడ్డ శ్రీకృష్ణ దేవరాయ నూనె విత్తుల కర్మాగారంలో ఏపీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ఆనంతరం గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీలో కేటాయించి భవనాల నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు గురుకులం గురించి పట్టించుకోకపోవడంతో సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతోంది.

గదుల కొరత

కనీస అవసరం మేరకు గదులు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతుల నిర్వహణకు 12 గదులు అవసరం. అయితే ఇక్కడ ఉన్నవి కేవలం ఆరు గదులే. వీటిలోనే తరగతుల నిర్వహణ, డైనింగ్, రాత్రి బస చేయాల్సిన దుస్థితి నెలకొంది. తాత్కాలిక రేకుల షెడ్లు, వరండాలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. పాడుబడ్డ భవనాల్లో అరకొర వసతుల నడుమ గురుకుల నిర్వహణ ఉంది. ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళల్లో బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోంది. బాలికల గురుకులం కావడంతో కనీసం ప్రహరీ సైతం నిర్మించకపోవడం శోచనీయం. రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండకపోతే పాముల బారినపడే ప్రమాదం పొంచి ఉంది. గురుకులంలో కనీస అవసరాలకు సరిపడా వసతి లేకపోవడంతో విద్యార్థినులు ఒకరి పెట్టెపై మరొకరి పెట్టెలు పెట్టుకుంటున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఉన్న ఆరు ఇరుకు గదుల్లోనే చదువు కొనసాగిస్తున్నారు. రేకుల కింద వంట చేయడం, ఆరు బయటే భోజనం చేయాల్సి వస్తోంది.



దోబీఘాట్‌ను తలపిస్తున్న గురుకుల ప్రాంగణం

ఒక్క రెగ్యులర్ పోస్టూ లేదు...

ఎనిమిదేళ్లలో పీలేరు బాలికల గురుకుల పాఠశాలకు ఒక్క రెగ్యులర్ పోస్టు కూడా మంజూరు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ డిప్యుటేషన్‌పై వచ్చిన ప్రిన్సిపాల్‌తో పాటు 11 మంది కాంట్రాక్ట్ టీచింగ్ స్టాఫ్, ఆరుగురు నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ముక్కావారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ గురుకులం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన కె.లోకేశ్వరి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ప్రారంభం నుంచి నేటి వరకు ఒక్క రెగ్యులర్ పోస్టు కూడా మంజూరు చేయకపోవడం శోచనీయం.

ప్రస్తుతం ఇక్కడ 220 మంది ఉన్నారు....

ఇక్కడ 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 220 మంది చదువుతున్నారు. ఈ ఏడాది ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. గత ఏడాది 254 మంది ఉన్నారు. మొత్తం సీట్లు 360. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు అనంతపురం, కడప జిల్లాలకు చెందిన విద్యార్థినులు ఇక్కడ చదువుతున్నారు.

ఏడు ఎకరాల స్థలం కేటాయింపు...

మండలంలోని గూడరేవులపల్లె పంచాయతీ పరిధిలో గురుకుల పాఠశాల కోసం ఏడు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. మొదట ముడుపులవేముల పంచాయతీలో కేటాయించిన స్థలాన్ని రద్దు చేశారు. గురుకులం ప్రారంభించి 13 సంవత్సరాలు దాటినా ఇప్పటి వరకు పక్కా భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపకపోవడం గమనార్హం. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో మంజూరైన నిధులు రద్దు కావడం, అనంతరం ఇప్పటి వరకు పక్కా భవనాల నిర్మాణం కోసం ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం శోచనీయం.

వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యం...

ఎన్ని సమస్యలు ఉన్నా పదో తరగతిలో వందశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకుపోతున్నాం. గత ఏడాది వందశాతం ఫలితాలు సాధించాం. ప్రస్తుతం 10వ తరగతిలో 62 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. గురుకుల సమస్యలపై పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మరోసారి కలసి పక్కా భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలని కోరతాం.



కె.లోకేశ్వరి, ప్రిన్సిపాల్,
ఏపీ గురుకుల పాఠశాల, పీలేరు.

వందశాతం పింఛన్ల పంపిణీ జరగాలి

- కలెక్టర్ శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగస్టు 1వ తేదీ వందశాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగాలని, ఉదయం 7 నుంచి పంపిణీ జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ కల్లా నగదు మొత్తాన్ని బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకుని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీకి అందుబాటులో లేని వారు, ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారు తప్ప మిగతా పింఛన్ల పంపిణీ 1వ తేదీనే జరగాలన్నారు. బదిలీపై నూతనంగా వచ్చిన సచివాలయ సిబ్బంది పింఛను లబ్ధిదారుల ఇంటి చిరునామాలను ముందే గుర్తించి పింఛన్ పంపిణీ వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. పింఛను లబ్ధిదారుల నుంచి నగదు తీసుకున్నట్లు సమాచారం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎల్డీఎం ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ

- ఆలిండియా హాకీ టోర్నమెంట్‌లో రన్నరప్ ట్రోఫీ



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న కలికిరి సైనిక్ స్కూల్ బాలికలు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ అండర్-17 బాలికల మధ్య జరిగిన జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌లో కలికిరి సైనిక్ స్కూల్ బాలికలు రన్నరప్‌గా నిలిచి సిల్వర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలల మధ్య తమిళనాడులోని అమరావతినగర్ సైనిక్ స్కూల్లో పది రోజుల పాటు ఈనెల 21 నుంచి జరిగిన పోటీలు బుధవారంతో ముగిశాయి. ఇందులో హాకీ టోర్నమెంట్ విభాగంలో కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థినులు సిల్వర్ ట్రోఫీ గెలుచుకున్నారు. మైన్‌పురి, కపుర్తలా, సంబల్‌పూర్ తదితర సైనిక్ స్కూల్ జట్లతో తలపడుతూ ఫైనల్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈస్ట్ సియాంగ్ సైనిక స్కూల్‌తో హోరాహోరీ తలపడ్డారు. చివరికి 1-2 స్కోర్ లైన్‌తో ముగిసిన మ్యాచ్‌లో రన్నరప్‌గా నిలిచారు. కలికిరి సైనిక్ స్కూల్‌కే చెందిన వేద ప్రగ్య జాతీయ స్థాయిలో ఉత్తమ గోల్ కీపర్‌గా ఎంపికైంది. కలికిరి విద్యార్థినులు ప్రదర్శించిన అత్యుత్తమమైన ప్రతిభను కలికిరి ప్రిన్సిపాల్ సి.ఎస్. పరదేశి ప్రశంసించారు.



జాతీయ స్థాయి ఉత్తమ గోల్ కీపర్ వేద ప్రగ్య

గోకులాల్లో.. గోల్‌మాల్! 6
- బినామీ పేర్లతో అనర్హులకు..
- ఉపాధి పనుల్లో భారీగా అవినీతి
- సామాజిక తనిఖీలో బయటపడేనా?

దొంగతనాలపై జాగ్రత్త

- బ్యాంకర్ల సమీక్షలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బ్యాంక్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బ్యాంకుల భద్రతా ప్రమాణాలపై జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యే దృశ్యం స్పష్టంగా కనపడేలా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకుల్లో ఏదైనా జరిగితే అలారం పోలీస్‌స్టేషన్‌లో మోగేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బ్యాంకులోని అందరు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరిగా జరిపించాలన్నారు. ఎవరైనా ముఖం కనబడకుండా బ్యాంకుకు వస్తే వారిని ముఖం చూపించమని అడగాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులు సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మీద దృష్టి పెట్టాలని, ఓటీపీల గురించి ఖాతాదారులను హెచ్చరిస్తూ ఉండాలని చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఎల్డీఎం ఆంజనేయులు, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ మల్లేశ్వర రావు, జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజారమేశ్, ఇన్‌స్పెక్టర్ జాన్‌జోసెఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి వెలిగల్లు నీరు

- స్థానిక ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుతాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలిలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెలిగల్లు నీరు అందిస్తామని, ఇందుకోసం రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సుపరిపాలన-తొలి అడుగులో భాగంగా బుధవారం లక్కిరెడ్డిపల్లె, రెడ్డివారిపల్లె, చింతకుంటపల్లె, నందివాండ్లపల్లె గ్రామాల్లో పర్యటించారు. ముందుగా లక్కిరెడ్డిపల్లెలో మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఎన్నికైన ఎస్ఎండీ షఫీనాయక్, మండల టీడీపీ ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్‌లు గజమాలతో సత్కరించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ హంద్రీ-నీవా నీరు శ్రీనివాసపురం ప్రాజెక్టుకు అందించడానికి రూ.200 కోట్లతో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి పల్లెలోనూ రూ.20 కోట్ల ఖర్చుతో 360 బోర్లు వేయించామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రెడ్డివారిపల్లె నుంచి నందివాండ్లపల్లెకు రూ.70 లక్షలతో తారురోడ్డు పనులకు మంత్రి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డెయ్యయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జయరాం, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి గాజుల ఖాదర్‌బాషా, గాలివీడు వెంకట్రామిరెడ్డి, సిద్ధక వెంక్రటామిరెడ్డి, యర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, మద్దిరేవుల సింగిల్ విండో అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కొండూరు వెంకట్రామరాజు, దిన్నెపాడు శ్రీనివాసులు, ముక్తార్ అహ్మద్, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 20 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



గంజాయి కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

గుర్రంకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యువతకు గంజాయి అలవాటు చేసి పక్కదారి పట్టిస్తున్న అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... గుర్రంకొండ పట్టణంలో గంజాయి బ్యాచ్‌లు అధికమై విద్యార్థులు, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు జిల్లా అధికారుల దృష్టికి మహిళలు సమస్యను తెలిపారు. దీంతో వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. ఈ క్రమంలో పట్టణంలోని చిట్టిబోయినపల్లె క్రాస్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ నిందితులను విచారించగా తమకు ఒడిస్సా, ఝార్ఖండ్‌కు చెందిన వారు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పీలేరు పట్టణం కలకడ మార్గంలోని దినకర్ హోటల్ వెనుక వైపున ఉన్న ఒడిశా, ఝార్ఖండ్, రాయచోటి ప్రాంతాలకు చెందిన ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి 16 కేజీల గంజాయి, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి మొత్తం 20 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పోలీసులు పట్టుకొన్న అరెస్టు చేసిన నిందితుల్లో ఓడిశా రాష్ట్రానికి చెందిన సుశాంత్ మహానంద, ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన షేక్ నౌషాద్ అహ్మద్, షేక్ ఇర్షాద్ అహ్మద్, రాయచోటికి చెందిన షేక్ మహ్మద్‌అలీ, బి.ప్రతాప్, జి.ఆసిఫ్, షేక్ ఫహద్ అలీ, చిత్తూరు జిల్లాకు చెందిన సిద్దయ్య, గుర్రంకొండకు చెందిన కె.ఆదిల్, టి.గణేష్‌లు ఉన్నారు. కాగా గుర్రంకొండకు చెందిన ఓ యువకుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం గంజాయి కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బందికి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐలు చంద్రశేఖర్, రామాంజనేయులు, ఏఎస్ఐ గజేంద్ర, బుజ్జి నాయక్, సిబ్బంది నాగరాజ, అబ్దుల్లా, రిజ్వాన్, అచ్యుతానంద, జనార్ధన్, రామ్మూర్తి, కృష్ణ, శివ, చంద్రశేఖర్, రాఘవ, మదీనా తదితరులు ఉన్నారు.

గుట్ట..గుల్ల...

- ఎక్స్‌కవేటర్‌తో చదును

గుర్రంకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండలో భూబకాసురుల ఆగడాలకు కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. గుట్టలపై ఎక్స్‌కవేటర్లను ఉంచి చదును చేసి బోర్లు వేసి ఆక్రమిస్తున్నారు. గుర్రంకొండ రెవెన్యూ గ్రామం గుర్రంకొండ-వాల్మీకిపురం రోడ్డు మార్గంలో ప్రభుత్వ భూములున్నాయి. ఈ భూములను కొందరికి ప్రభుత్వం డీపట్టాలను మంజూరు చేసింది. డీ పట్టాలను పొందిన కొందరు వ్యక్తులు పక్కనున్న చిన్న చిన్న గుట్టలను కూడా చదును చేసి ఆక్రమిస్తున్నారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న గుట్టను అక్రమార్కులు రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఆర్ఐ సదాశివప్పనాయుడును వివరణ కోరగా గుట్టను చదును చేస్తున్నట్లు తమ దృష్టికీ వచ్చిందన్నారు. గుర్రంకొండ వీఆర్ఏలను పంపించి పనులను నిలుపుదల చేసినట్లు తెలిపారు. గుట్టలు, కొండలను ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మార్కెట్ యార్డుకు సమీపంలో గుట్టను ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్న దృశ్యం

రుచిగా.. శుచిగా..

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు తీరుపై అన్ని వర్గాల సంతృప్తి ● క్యారియర్లు తెచ్చుకోవడం లేదంటున్న విద్యార్థులు



కోడిగుడ్లు, చిక్కీలు తీసుకుంటున్న విద్యార్థులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ పూర్తిగా మార్చి వేసింది. దీంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో రుచిగా, శుచిగా వండిన అన్నం వడ్డిస్తున్నారు.



భోజనం చేస్తున్న విద్యార్థినులు

సుండుపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 70 ప్రాథమిక పాఠశాలలుండగా, సుమారు 3 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువు కుంటున్నారు. వారందరికీ క్రమం తప్పకుండా మెనూ ప్రకారం భోజనం అందించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుండడంపై ఉపాధ్యాయులతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూస్తున్నారు. పాఠశాలలను సందర్శించే ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భోజనం రుచి చూడాలని ఉపాధ్యాయులు, వంట మనుషులు కోరుతున్నారు.

భోజనం క్యారియర్లు బంద్

గత ప్రభుత్వంలో నాణ్యమైన బియ్యం సరఫరా, సకాలంలో వంట ఏజెన్సీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు నాణ్యమైన భోజనం అందేది కాదు. దాంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు ఇంటినుంచి క్యారియర్లలో భోజనం తెచ్చుకునేవారు. ప్రస్తుతం బడిలో పెట్టే భోజనం నాణ్యతతో పాటు రుచిగా సైతం ఉండడంతో ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకోవడం మానేశామని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరిట నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యతగా ఉండడంతో విద్యార్థులు ఇష్టపడి తింటున్నారు. అందుకే ప్రస్తుతం ఇంటి నుంచి క్యాయర్లు తెచ్చుకోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

హాజరుశాతం పెరుగుతోంది

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం వసతి ఉంది. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని చదువులోనూ రాణించాలి.

- రవీంద్రనాయక్, మండల విద్యాశాఖ అధికారి-2

కడుపునిండా తింటున్నాం..



గతంలో భోజనం తింటున్నా తృప్తి ఉండేది కాదు. ఇప్పుడు మేలు రకం బియ్యంతో వండి పెడుతున్నారు. దాంతో కడుపునిండా తింటున్నాం. ఇంట్లో భోజనం చేసిన అనుభూతి పొందుతున్నాము.

- అయాస్, షోయబ్, విద్యార్థులు

చాలా బాగుంది



గతంలో దొడ్డు బియ్యంతో చేసిన అన్నం పెట్టేవారు. ముద్దగా ఉండటంతో సరిగ్గా తినలేకపోయేవాళ్లం. ఇప్పుడు సన్న బియ్యంతో రుచిగా వండి పెడుతున్నారు. వారానికి ఐదు రోజులు కోడిగుడు, మూడు రోజులు చిక్కీ ఇస్తున్నారు.

- పార్వతీదేవి, 8వ తరగతి



సాంఘికశాస్త్ర క్లబ్...
సామాజిక చైతన్యానికి దిక్సూచి కావాలి

● విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు పెంపొందించాలి ● డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి వారిని చైతన్యవంతమైన పౌరులుగా సాంఘిక శాస్త్ర క్లబ్ తీర్చిదిద్దాలని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు సూచించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ సాంఘికశాస్త్ర క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చరిత్ర, రాజకీయ, భౌగోళిక శాస్త్రం, ఆర్థిక వ్యవస్థలపై అవగాహన పెంపొందించేలా క్లబ్ పని చేయాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు,విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడే కృత్యాధార బోధనకు క్లబ్ తోడ్పడాలన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధికి క్లబ్ తోడ్పడాలన్నారు. పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా సమకాలీన సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేలా క్లబ్ తన సేవలను అందించాలన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపగలిగే చైతన్యవంతమైన పౌరులను తయారు చేయడమే క్లబ్ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు బోధనాంశాల్లో క్లబ్ సహకరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఈ క్లబ్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, విద్యార్థులు దానిని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, శివభాస్కర్, గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, శివప్రసాద్, కేధర్నాధ్, ఉషామాధురి, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు
నివేదికలు సిద్ధం చేయండి

● సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎంత భూమి అవసరం, ఎంత పెట్టుబడి పెట్టాలి, ఎంతమంది కార్మికులు కావాలి తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ మార్కెటింగ్, హార్టికల్చర్, ఇండస్ట్రియల్, వ్యవసాయ శాఖాధికారులతో సబ్‌కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మదనపల్లె మార్కెట్‌ను పరిశీలించి అప్పట్లో అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. ముఖ్యంగా టమోట ధరలు పడిపోయి, గిట్టుబాటు కూడా రాని సమయంలో రైతులను ఆదుకోవడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారన్నారు. ఇందులో భాగంగా రెండో సారి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. టమోట గుజ్జు పరిశ్రమను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలచే నిర్వహించడంపై ఆలోచించాలన్నారు. కుటీర పరిశ్రమగా గుజ్జు పరిశ్రమలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మదనపల్లె టమోట మార్కెట్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వలన సీజన్‌లో ఎక్కువ సంఖ్యలో లారీలు వస్తే ఇబ్బందులు వస్తున్నాయని, టమోటా మార్కెట్‌ను పట్టణం వెలుపలకు మార్చేందుకు, ఎంత భూమి అవసరం ఉంటుందో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఉద్యానశాఖ జిల్లా అధికారిణి సుభాషిణి, హెచ్‌వో ఈశ్వరప్రసాదరెడ్డి, మార్కెట్ కార్యదర్శి జగదీశ్, అభిలాష్, ఏవో నవీన్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదు చేశారని దాడి



మాట్లాడుతున్న తెలుగు యువత నేత ఆంజనేయులునాయుడు

సుండుపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్పందనలో ఫిర్యాదు చేశామని అరుణ్‌కుమార్, మరికొంత మంది తమపై దాడి చేశారని తెలుగు యువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంజనేయులు నాయుడు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. జీ.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో నకిలీ పించన్లతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని, సర్వే నెంబర్ 731-4లో గల ప్రభుత్వ భూమి (గయాలు) ఆక్రమణ కు గురవుతోందని, జూలై 7 న స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. బుధవారం కొలతల కోసం రెవెన్యూ అధికారులు రావడంతో అక్కడికి వెళ్లిన తమపై దాడి చేశారన్నారు. గ్రామస్తులతో పాటు బయటి ప్రాంతాల నుండి మనుషులను తీసుకువచ్చి దాడికి యత్నించారన్నారు. దీంతో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబునాయుడు, కిరణ్ నాయుడు, కోనంకి రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రామాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో స్కూటర్‌పై వెళుతున్న దంపతులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కడప ఐటీఐకి చెందిన మహబూబ్‌బాషా తన భార్య మహబూబ్ జాన్‌తో కలసి స్కూటర్‌పై కడప నుంచి రాయచోటికి వెళుతుండగా గువ్వలచెరువు బస్టాండు సమీపంలో లారీ ఢీకొంది. సమాచారం అందుకున్న రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడినవారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ● మహిళా సంఘాల సభ్యులకు గుడ్లు విక్రయించే బండ్ల పంపిణీ



గుడ్ల బండిని అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్

రాయచోటి కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమైందని, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం 50 వేల రూపాయల విలువైన గుడ్ల అమ్మకపు బండిని జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నమయ్య జిల్లాలోని ఎంపిక చేసిన పది మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి చెందడానికి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని ఆ కృషి ఫలాలను నేడు రాష్ట్రంలోని స్వయంసహాయ సంఘాల ద్వారా మహిళలందరూ పొందుతున్నారన్నారు. ప్రస్తుతం అందజేసిన గుడ్ల అమ్మకపు బండ్లు పౌష్టికాహారంతో పాటు గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తేవడం, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగించడం అనే రెండు లక్ష్యాలతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, జాతీయ గుడ్డు సమన్వయ కమిటీతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం మేరకు ఈ బండ్లు పంపిణీ చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మొత్తం 1000 ఎన్‌హెచ్‌జీ గ్రూపుల్లోని ఒక్కొక్క సభ్యురాలికి ఒక గుడ్డు అమ్మకపు బండి చొప్పున మొత్తం 1000 ు బండ్లను సరఫరా చేయనున్నారన్నారు. మొదటి దశలో అన్నమయ్య జిల్లాకు 10 బండ్లు కేటాయించగా, వీటిని ఈ రోజు లబ్దిదారులకు అందజేశామన్నారు. ఈ లబ్దిదారులకు గుడ్లతో చేసే రకరకాల వంటకాలపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం శిక్షణ ఇస్తుందని, దీంతో అదనంగా దాదాపు 20,820 రూపాయల లబ్ధి చేకూరనుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల శాంతి కల్యాణం

● హనుమంతుడిపై రాముడి నగరోత్సవం



సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, జూలై 30: పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవచేశారు. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో ఊంజల్‌సేవ, రాత్రికి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల శాంతి కల్యాణం చేశారు. చివరగా ముస్తాబైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్, ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు, వేదపండితులు కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోకుల్, భాషికాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిషేక మహోత్సవాల్లో నేడు..

రాముడి పట్టాభిషేక మహోత్సవాలలో గురువారం ఉదయం స్నపన తిరుమంజనం, రాముడి పట్టాభిషేకం, ఊంజల్‌సేవ, రాత్రికి గరుడవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

జమ్మలమడుగు డీఎల్డీవోగా రామాంజనేయులు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజనల్ డెవల ఎమెంట్ అధికారిగా వి.రామాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 జనవరి 17న ఆయన అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్లిన ఆయనను మాతృ సంస్థకు పంపుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు ఉత్తర్వులిచ్చారు. దీంతో రామాంజనేయులు పోస్టింగ్ కోసం పంచాయతీ రాజ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం రామాంజనేయులును జమ్మలమడుగు డీఎల్డీవోగా నియమిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

గోకులాల్లో.. గోల్‌మాల్!

● బినామీ పేర్లతో అనర్హులకు..

● ఉపాధిహామీ పనుల్లో భారీగా అవినీతి ..

● సామాజిక తనిఖీలో బహిర్గతమయ్యేనా ?



ఉపాధిహామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్

పాడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులాల నిర్మాణాల్లో అవినీతి పేరుకుపోయింది. రైతుల పేరుతో అనర్హులకు మంజూరు చేయడంతోపాటు, నిధులను ఇతరులు ఖాతాలోకి మళ్లించి స్వాహా చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుర్రంకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలానికి ఉపాధిహామీ పథకం కింది 58 గోకులం షెడ్లు మంజూరు కాగా 55 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ షెడ్లను పాడి రైతులకు మాత్రమే కేటాయిం చాల్సి ఉండగా, పలువురు అనర్హులు సొంతం చేసుకు న్నారు. ఈ విషయాన్ని ఉపాధిహామీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇ లాంటివారు గోకులాల నిర్మాణంలో ప్రభుత్వం నిబంధనలు అతిక్రమించినా, పూర్తి స్థాయిలో బిల్లులను చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక తనిఖీ బృందం పనులను తనిఖీ చేయనుండడంతో అవినీతికి పాల్పడిన సిబ్బంది తమను కాపాడాలంటూ రైతులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులను నిష్పక్షపాతంగా తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను వెలికితీయాలని కూలీలు, రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీవో జయరామిరెడ్డి మాట్లాడుతూ గోకులాల షెడ్లను పాడి రైతులే నిర్మించుకున్నారు. బినామీ పేర్లతో గోకులాలను నిర్మించుకున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. అలా ఎవరైనా బినామీ పేర్లతో గోకులాలను నిర్మించుకుని ఉంటే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైవీయూ వీసీ కోసం సెర్చ్ కమిటీ ఏర్పాటు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్శిటీకి వైస్ చాన్సలర్ నియామకం కోసం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ (సెలెక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీ నియమాకం కోసం అర్హతలు కలిగిన ముగ్గురు పేర్లను సూచించాల్సిందిగా సెర్చ్ కమిటీని ప్రభుత్వం కోరింది. ప్యానల్ సభ్యుల పేర్లను ప్రాధాన్యత ప్రకారం అక్షర క్రమంలో పేర్కొని జాబితాను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా కమిటీని కోరింది. సెర్చ్ కమిటీ సిఫారసులను తదుపరి వీసీ నియామకం కోసం గవర్నరుకు ప్రభుత్వం పంపాల్సి ఉందని తెలిపింది. సెర్చ్ కమిటీలో ప్రభుత్వ నామినీగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి. జార్జి విక్టర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా రాయలసీమ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.వి. ప్రసాద్ రావు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీగా సిమ్లాలోని హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియోగ్రఫీ ప్రస్తుత ఛైర్మన్, మండి సర్దార్ పటేల్ యూనివర్శిటీ మాజీ వీసీ దేవ్‌దత్ శర్మలను సభ్యులుగా నియమించారు. ప్రభుత్వ నామినీగా నియమితుడైన సభ్యుడు కమిటీ ఛైర్మన్‌గా వ్యవరిస్తారని, వీలైనంత తొందరగా వీసీ నియామకం కోసం అవసరమైన సమావేశాలను నిర్వహించాలని పేర్కొంటూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి

తంబళ్లపల్లె, జూలై 30(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలని డీపీవో రాధమ్మ సూచించారు. బుధవారం డీఎల్‌పీవో నాగరాజుతో కలిసి రేణుమాకులపల్లెలో ఆమె పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, చెత్త సంపద కేంద్రం, మురుగు కాలువలు, తాగు నీరు, వీధి దీపాలను పరిశీలించారు చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని స్థానికులకు సూచించారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి జితేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్ల భూబాగోతం!

● అక్రమ మ్యుటేషన్లు, వెబ్‌ల్యాండ్‌లో నమోదుపై విచారణకు జేసీకి ఆదేశాలు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలో పనిచేసిన ఇద్దరు తహసీలార్ల భూబాగోతంపై జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలసపాడు మండలంలోని కలసపాడు, శంకవరం, మామిళ్ళపల్లె గ్రామాల్లోని వివిధ సర్వే నంబర్లలోని 45.94 ఎకరాల డీకేటీ భూములను ఆరుగురి పేరుతో వెబ్ ల్యాండ్‌లో నమోదు నమోదు చేసినట్లు ప్రధాన ఆరోపణ. అప్పట్లో తహసీల్దారుగా పనిచేసిన ఎం.మోహన్ (ప్రస్తుతం రిటైర్డు), ఆ తరువాత ఇన్‌చార్జీ తహసీల్దారుగా వ్యవహరించిన డిప్యూటీ తహసీల్దారు ఎన్.నాగవాహిణిలు కుట్రపూరితంగా వ్యవహరించినట్లు పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పటి బద్వేలు డివిజన్ ఆర్డీవో విచారణ రికార్డులను పరిశీలించి 2022 డిసెంబరు 10 నివేదిక సమర్పించారు. అక్రమాలకు పాల్పడ్డ తహసీల్దార్లపై చర్యలు తీసుకోవలసిందిగా ఆర్డీవో సిఫారసు చేశారు. 2023 జనవరి 26న కలెక్టరు ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదికల ప్రకారం పెద్దిరెడ్డి పురుషోత్తం రెడ్డి, పెద్దిరెడ్డి సావిత్రి పేర్లతో 21.22 ఎకరాలు, పెద్దిరెడ్డి మునిరెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మీదేవి పేర్లతో 15.92 ఎకరాలు, పెద్దిరెడ్డి పెద్దవెంకటసుబ్బారెడ్డి పేరుతో 4.90 ఎకరాలు, పెద్దిరెడ్డి హైమవతి పేరుతో 3.90 ఎకరాల డీకేటీ భూములను నిబంధనలను అతిక్రమించి ఇద్దరు తహసీల్దార్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు ఈ నివేదికలు తేల్చాయి. ప్రతి సర్వే నంబరును ఏ తేదీన, ఏ తహసీల్దారు, ఎవరి పేరుతో మ్యుటేషన్ చేసి వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసినట్లు పూర్తి వివరాలతో వెల్లడించారు. డీకేటీ రిజిస్టరులో నంబర్లను తారుమారు చేయడం, అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా తదుపరి కార్యాచరణకు పూనుకోవడం తీవ్రమైన చర్యగా పేర్కొన్నారు. ఈ నివేదికల ఆధారంగా 2023 జూన్ 16న తహసీల్దార్లు మోహన్, నాగవాహినిలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పది రోజుల్లోగా వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. 2024లో ఇరువురూ తమ వాదనలను ప్రభుత్వానికి సమర్పించారు. వీటితో ఏకీభవించని ప్రభుత్వం ఈ మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమించారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక ప్రభుత్వాని పంపాల్సిందిగా జేసీకి సూచించారు. విచారణలో జేసీకి సహకరించడానికి బద్వేలు ఆర్డీవోను ప్రెజెంటింగ్ అధికారిగా కూడా నియమిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

చీనీ, నిమ్మ మొక్కలు పంపిణీకి సిద్ధం



చీనీ, నిమ్మ మొక్కలకు అంటు కడుతున్న కూలీలు

రైల్వేకోడూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యాన మోడల్ నర్సరీలో రైతులకు అందుబాటులో నాణ్యమైన చీని, నిమ్మ మొక్కలు ఉన్నట్లు బుధవారం రైల్వేకోడూరు ఉద్యాన శాఖ నర్సరీ అధికారి బి. లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో చీనీ, నిమ్మ తోటలలో చీడపీడల ఉధృతి పెరగడంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందన్నారు. ఈ సమస్యను అధికమించడానికి రైతులకు మే లైన, నాణ్యమైన మొక్కలను ప్రభుత్వ నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని రైతులకు తెలిపామన్నారు. మొక్కల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని, చీనీలో అయితే రంగాపూర్ మీద అంటు కట్టిన రెండు నుంచి రెండున్న అడుగుల ఎత్తు కల్గి, నాలుగైదు ఆరోగ్యకరమైన కొమ్మల నుంచి రెండున్నర నుంచి మూడున్నర సెంటీమీటర్ల మందం కలిగిన మొక్కలను ఎంపిక చేసుకోవడం వలన చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులను పొందవచ్చునని తెలిపారు. ఉద్యాన రైతులకు నాణ్యమైన మొక్కలను అందించే ఉద్దేశంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఏపీ మోడల్ నర్సరీలో రంగాపూర్ మొలకలపై కట్టిన 80 వేల చీనీ మొక్కలు, 15 వేల నిమ్మ మొక్క లు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఒక్కో చీని మొక్క రూ. 55లు, నిమ్మ మొక్క రూ. 25కు ఇవ్వనున్నామని తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద మొక్కలను ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఉద్యానశాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన మొక్కలను ఎంపిక చేసుకొని సాగు చేయడం ద్వారా సుమారు 30 ఏళ్ల వరకు కూడా చీని, నిమ్మ చెట్ల ద్వారా రైతులు దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నామని తెలిపారు.

APK... క్లిక్ చేస్తే

ఏపీకే అనేది ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉపయోగించే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి ఉపయోగించే ఫైల్ ఫార్మాట్. సైబర్ నేరస్థులు హానికరమైన ఏపీకే ఫైల్‌లను సృష్టించి వాటిని సోషల్‌మీడియా, మెసేజింగ్ యాప్‌ల ద్వారా పంపుతారు. ఈఫైల్‌లు నమ్మదగిన యాప్‌ల మాదిరిగానే కనిపిస్తాయి. కానీ అవి మాల్వేర్‌ను కలిగి.. వినియోగదారుల ఫోన్‌లను హ్యాక్ చేయడానికి ఉపయోగిస్తారు.

- లింక్ టచ్ చేస్తే.. డేటా సైబర్ నేరగాళ్ల చేతిలోకే
- అప్రమత్తంగా లేకపోతే క్షణాల్లో ఖాతా ఖాళీ



కడప క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేటి డిజిటల్ ప్రపంచంలో మొబైల్ యాప్‌లు మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారాయి. అయితే, గూగుల్, ప్లేస్టోర్ వెలుపల యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు మీకు తరచుగా ఏపీకే అనే ఫైల్ ఫార్మాట్ తారసపడవచ్చు. చాలా మంది యూజర్లు ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయడానికి సంకోచిస్తుంటారు. ఇది హ్యాకింగ్‌కు లేదా బ్యాంక్ ఖాతా మోసాలకు దారితీయవచ్చని భయపడుతుంటారు. ఏపీకే ఫైల్ అంటే ఏమిటి... దాని ప్రాముఖ్యత ఏంటి, దాంతో వ్యవహరించేటప్పుడు ఎందుకు జాగ్రత్త అవసరమో సైబర్ క్రైం పోలీసులు చెబుతున్న వివరాలు తెలుసుకుందాం.



సైబర్ నేరగాళ్లు వాట్సప్ గ్రూపుల్లో పంపిన లింకులు

ఏపీకే మోసాలు ఇలా..

ఏపీకే అంటే ఆన్‌లైన్ ప్యాకేజీ కిట్ అని అర్థం. హ్యాకింగ్ చేసేందుకు ఉపయోగించే ఒక అప్లికేషన్ ఇది. ఎక్కువగా బ్యాంక్ పేర్లపై ప్రభుత్వానికి చెంది న స్కీముల పేరుతో పంపిస్తారు. వాట్సప్ ద్వారా పంపించారంటే పొరపాటున అది క్లిక్ చేస్తే మీ డేటా మొత్తం సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటారు. తరువాత మన గ్రూపులో ఉన్న వాట్సప్ నంబర్‌లకు పంపిస్తారు. వారు ఎవరైనా క్లిక్ చేస్తే ఖాతా లో డబ్బు కాజేస్తారు.

ప్రస్తుతం ఏపీకే అప్లికేషన్ మోసాలు ఎక్కువయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడు నెలల్లో 94 ఫిర్యాదులు రాగా 96 లక్షలు డబ్బులను సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. దీన్ని బట్టి మోసపోయే వారు ఎలా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి మోసాలకు పాల్పడే అవ కాశం ఉండదు.

జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు..

- ఇటీవల జిల్లాలో ఏపీకే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన ఓ ఉద్యోగికి పీఎం కిసాన్ పేరుతో లింకులు పంపించారు. దీంతో ఆయన ఆ లింక్ క్లిక్ చేయడంతో రూ.81 వేలు పోగొట్టుకున్నారు.
- సీకేదిన్నె మండలానికి చెందిన ఓ విద్యార్థి ఏపీకే లింక్ పంపి రూ.8వేలు కాజేశారు.
- కడప చెందిన ఓ మహిళకు ఎస్‌బీఐ యూనో లింక్ పంపించారు. ఆమె ఆ లింకును క్లిక్ చేయడంతో రూ.30 వేలు పోగొట్టుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సొమ్ము సేఫ్‌గా ఉంటుందని సైబర్ క్రైం పోలీసు అధికారులు చెబుతున్నారు.

పరివర్తన రావడానికి చర్యలు : డీఈవో



ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో షంషుద్దీన్

కమలాపురం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారిలో పరివర్తన రావడానికి చర్యలు తప్పవని డీఈవో షంషుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని పెద్దచెప్పలి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మంగళవారం మద్యం తాగి స్కూలుకు రావడంతో జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి వెంటనే సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ అధికారి డీఈవో షంషుద్దీన్ బుధవారం హైస్కూలుకు చేరుకుని ఉపాధ్యాయులను విచారించారు. ఇలాంటి తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

వైవీయూ అధ్యాపక సంఘ నూతన కార్యవర్గం



అధ్యాపక సంఘం నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ ఎస్.ఈశ్వరరెడ్డి ప్రకటించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల అంగీకారం మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా వృక్షశాఖ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తెలుగుశాఖ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎం వినోదిని, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎల్.మాధవి, డాక్టర్ వి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె.మృత్యుంజయరావు, కోశాధికారిగా డాక్టర్ జయంతి కశ్యప్‌లను ఎన్నుకున్నారు. పాలకమండలి సభ్యులుగా డాక్టర్ ఎ.శ్రీధర్‌బాబు, ఆచార్య మెర్సీ విజేత, డాక్టర్ వీవీ వెంకటరాము, డాక్టర్ వరప్రభాకర్, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ గణేష్‌నాయక్, డాక్టర్ వి.లాజర్, డాక్టర్ గంజి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల నుంచి ఒక సంయుక్త కార్యదర్శి, ఒక పాలకమండలి సభ్యుడు ఉంటారని తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల కాలపరిమితితో పనిచేస్తాయన్నారు.

పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం

- ఆరోపించిన బాధితులు

కడప క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వేధింపులతో తమ సోదరుడు ఆర్.చిన్న బాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతడి సోదరులు ఏసన్న, బాలయ్య తెలిపారు. బుధవారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. కొండాపురం మండలం సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన ఆర్.చిన్నబాలయ్య (45)ను పోలీసులు వేధిస్తున్నారని అన్నారు. తమకు చాలా కాలం క్రితం ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని అయితే ఆ స్థలాన్ని ఓ హోంగార్డు, కానిస్టేబుల్ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీనిని అడ్డుకున్నందుకు తమ సోదరుడిపై తప్పుడు కేసులు పెడుతున్నారని వాపోయారు. దీంతో మనస్థాపం చెంది చిన్నబాలయ్య మంగళవారం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వెంటనే కడప రిమ్స్‌కు తీసుకొచ్చామన్నారు. మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తీసుకుపోతు న్నామని, తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తాళ్లప్రొద్దుటూరు పోలీసులను వివరణ కోరగా చిన్నబాలయ్యపై తాళ్లప్రొద్దుటూరులోనే ఐదు కేసులు నమోదయ్యాయని సీకేదిన్నె, తలమంచిపట్నం పోలీస్ స్టేషన్లలో కూడా కేసులున్నాయని అన్నారు. అతడు నేరాలకు పాల్పడ్డంతోనే కేసులు నమోదు చేశామని తెలిపారు.

గ్రామ సుపరిపాలనలో జడ్పీటీసీల పాత్ర కీలకం

- జడ్పీ సీఈవో ఓబులమ్మ



మహిళా జడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ సుపరిపాలనలో జడ్పీటీసీలు కీలక పాత్ర వహించాలని జడ్పీ సీఈవో, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ సి.ఓబులమ్మ పేర్కొన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ)లో మహిళా జడ్పీటీసీలకు రెండో రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు ఈ శిక్షణకు 25 మంది మహిళా జడ్పీటీసీలకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. రెండోరో జు బుధవారం మాత్రం 14 మంది హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి సీఈవో ఓబులమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళల భాగస్వామ్యం, న్యాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణను కల్పిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళల స్వశక్తీకరణ మరింతగా పెరగాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి బలమైన ఆధారంగా నిలుస్తోందన్నారు. ప్రజలే నిర్ణయాలలో భాగస్వాములు కావడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. గ్రామీణ భవిష్యత్ నిర్మాణంలో మహిళా జడ్పీటీసీల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. తమరోజువారి పనుల్లో ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలకు పరిష్కార మార్గం చూప డానికి ఈ శిక్షణా మాడ్యూల్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా మహిళా జడ్పీటీసీలకు సుస్థిరమైన సాధికారత కలుగుతుందన్నారు. మరిం త ధైర్యంగా, నమ్మకంగా నాయకత్వ బాధ్యతలు తీసుకునే స్థితిలోకి వస్తారన్నారు. తమ నైపుణ్యాలపై అవగాహనను పెంచుకుంటూ గ్రామ అభివృద్ధిని ముందుండి నడిపించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉంటారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు దోహద పడుతుందన్నారు.

కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ఏవో బండపల్లి నాగభూషణం, మాస్టర్ ట్రైనర్స్, మహిళా జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎన్ఆర్ఐ చేయూత

- ప్రవాస భారతీయుడు రూ.లక్ష విరాళం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



నగదును అందజేస్తున్న ఎంపీడీవో రామచంద్రయ్య, సర్పంచ్ బీబీ

దువ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది డిసెంబరు 20వ తేదీన ప్రచురితమైంది. అప్పట్లోనే అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ ఈ విషయమై వాకబు చేశారు. మృతుని కుటుంబ పరిస్థితి తెలుసుకుని ఇండియాకు వచ్చినప్పుడు ఏదో ఒకరూపంలో సాయం చేస్తానని అప్పట్లో ఎన్ఆర్ఐ మాట ఇచ్చారు. ఈ ప్రకారం రూ.లక్ష నగదు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చి సదరు కుటుంబానికి అందజేయమన్నారు. ఈ మేరకు దువ్వూరు మండలం కానగూడూరు గ్రామానికి చెందిన మల్లేష్ భార్య సుమలత వారి పిల్లలను పిలిపించి స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీడీవో రామకృష్ణయ్య, అక్కడి సర్పంచ్ బీబీ చేతుల మీదుగా నగదును బుధవారం అందజేశారు. పోస్టాఫీస్ బీపీఎం ప్రసాద్‌ను పిలిపించి మృతుని నలుగురు కూతుర్ల పేరుమీద నగదును డిపాజిట్ చేయమని ఎంపీడీవో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వే ఉద్దేశ్యం ఇదేనని, పేదరికం పారదోలేందుకు గ్రామాలను దత్తత తీసుకుని ఆర్థిక, మాటసాయం, వస్తు రూపేణా తోడ్పడటం పీ4 లక్ష్యమన్నారు. ఈ సాయం పి4 సర్వేకు దగ్గరగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, గ్రామ వీఆర్వో, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి రూ.8.94 లక్షల ఆదాయం

సీకేదిన్నె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గంగమ్మ గుడికి రూ.8,94,500 వేలం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలంలో షామియానా, కుర్చీలు, టేబుళ్లకు ఆజాద్‌నగర్‌కు చెందిన ఎ.వెంకటసుబ్బయ్య రూ.5.80లక్షలకు దక్కించుకున్నారన్నారు. కూల్‌డ్రింక్ షాపునకు ప్రొద్దుటూరుకు చెందిన ఎం.వెంకటరమణ రూ.1.86 లక్షలకు, పూలు, పూజా సామాగ్రి కడప అక్కాయపల్లెకు చెందిన ఎం.పవన్‌కల్యాణ్ రూ.1.22 లక్షలకు, చెప్పులస్టాండు కె.పెద్దఓబులేసు రూ.6,500లకు దక్కించుకున్నారన్నారు. వీరికి ఆగస్టు 1 నుంచి వచ్చే సంవత్సరం జూలై 31 వరకు హక్కులు కల్పించామని ఈవో తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇనుపగేటు మీదపడి చిన్నారి మృతి



అనుశ్రీ (ఫైల్ ఫొటో)

ముద్దనూరు జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న ఇనుపగేటు మీదపడటంతో చిన్నారి అనుశ్రీ(7)మృతి చెందింది.స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. తొండూరు మండలం ఊడవగాండ్ల గ్రామానికి చెందిన గాయత్రీ ప్రసవానికి తల్లిగారింటికి నల్లబల్లెకు ఒక్కగానొక కూతురు అనుశ్రీతో వచ్చింది. సాయంత్రం ఆడుకుంటుండగా ఇంటిముందున్న ఇనుప గేటు ఊడి చిన్నారిపై పడింది. తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న చిన్నారి మరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

యువకుడు ఆత్మహత్య



లింగాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం ఎర్రమేకల భరత్‌కుమార్ (23) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... భరత్‌కుమార్ కొన్ని సంవత్సరాల నుంచి కంటి సమస్య, మైగ్రేన్ తలనొప్పి తదితర సమస్యలతో బాధపడుతుండేవాడు. ఆరోగ్య సమస్యలను భరించలేక, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

చాపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఖాజీపేటకు చెందిన సుంకు వెంకట మీనాక్షి అనే విద్యార్థిని ఈ నెల 29న మంగళవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఓ ప్రైవేటు కాలేజీలో మీనాక్షి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికిరాలేదు. ఈ మేర కు విద్యార్థిని తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకుల వీధిలో చోరీ

కడపక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆకుల వీధిలో ఈనెల 29న గుర్తు తెలియని దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి 7 తులాల బంగారు అపహరించినట్లు టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆకుల వీధిలో నివాసం ఉంటున్న షేక్ తస్లీమ్ అనే మహిళ మంగళవారం పుట్టింటికి వెళ్లిందని, తిరిగి బుధవారం వచ్చే లోపు ఇంటి తాళాలు తెరచి ఉండడంతో ఇంట్లో బీరువాను పరిశీలించగా అందులో ఉన్న 7 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఇలియాస్ బాష, రాళ్లపల్లె అబ్దుల్లాలు డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని ఎస్‌టీయూ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయ డానికి ముందస్తు సమావేశం నిర్వహించారు.

3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఆగస్టు 3వ తేదీ ఆదివారం ఉదయం జిల్లాస్థాయి అండర్-14, 16 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్ బాష తెలిపారు. అండర్-14 విభాగంలో బాలబాలికలకు 60 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-16 విభాగంలో బాలబాలికలకు 60, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచినవారు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఆధార్, బర్త్‌సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని కోరారు

ప్రాచీన కళలను కాపాడుకునేందుకు చొరవ చూపాలి : ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీకి తోలుబొమ్మను బహూకరిస్తున్న కుళాయప్ప

పులివెందుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనకళలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పులివెందులలోని ఆయన స్వగృహంలో హస్తకళల విభాగంలో జాతీయ అవార్డులను పొందిన దలవాయి కులాయప్ప ఎమ్మెల్సీని కలిశారు. తోలు బొమ్మను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలో తోలుబొమ్మ కళాకారులైన తల్లీకొడుకులైన దలవాయి శివమ్మ, దలవాయి కులాయప్పలు హస్తకళల విభాగంలో ఇటీవల జాతీయ అవార్డులను పొందారన్నారు. ప్రాచీక కళలలు అంతరించిపోకుండా శ్రీకృష్ణ చరిత విశ్వరూపహనుమాన్ వంటి కళాఖండాలను రూపొందించి ఆదర్శంగా నిలిచారన్నారు. తల్లీ కొడుకులకు జాతీయ అవార్డు రావడంతో ఎమ్మెల్సీ వారిని అభినం దించారు. దేశ స్థాయిలో ఆంధ్ర రాష్ట్రానికి ఖ్యాతితెచ్చినందుకు వారిని ప్రశంసించారు.

హోరాహోరీగా సాగుతున్న మల్టీడే క్రికెట్ పోటీలు




ఆదినారాయణ (అనంతపురం), రుత్విక్‌కళ్యాణ్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా రెండో రోజైన బుధవారం పోటీలు సాగాయి. అనంతపురం జట్టు కడప జట్టుపై 270 పరుగులు ఆధిక్యత సాధించగా.. మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు చిత్తూరు జట్టుపై 25 పరుగుల స్వల్ప వెనుకంజలో నిలిచింది. వివరాలిలా... కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్లు మధ్య మ్యాచ్ సాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో అనంతపురం జట్టు 53.1 ఓవర్లలో 186 పరుగులకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజైన బుధవారం తిరిగి బ్యాటింగ్ ప్రారంభించి 53.3 ఓవర్లలో 158 పరుగులకు కుప్పకూలింది. దీంతో అనంతపురం జట్టుకు 28 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 242 పరుగులు సాధించింది. ఇందులో ఆదినారాయణ 118 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో ఇప్పటి వరకు 270 పరుగుల ఆధిక్యత సాధించి పటిష్ట స్థితికి చేరుకుంది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటిరోజు తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 92.1 ఓవర్లలో 325 పరుగులు భారీ స్కోరుకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 44 పరుగులతో తిరిగి బ్యాటింగ్ చేపట్టిన కర్నూలు జట్టు 100 ఓవర్ల పాటు ఆడి 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. ఇందులో రుత్విక్ కళ్యాణ్ 90 పరుగులు చేశాడు. దీంతో కర్నూలు జట్టు మరో 25 పరుగుల స్వల్ప వెనుకంజలో ఉంది.

గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లులు అందేదెప్పుడో..?

● కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



సాతుపల్లెలో గోడల వరకు పూర్తయి ఆగిన పక్కా గృహం

పెనగలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లులు అందేనా అని లబ్ధిదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. పెనగలూరు మండలంలో హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 2016 నుంచి 2019 వరకు నిర్మించుకొన్న పక్కాగృహాలకు పెండింగ్ బిల్లులు లబ్ధిదారులకు నేటికీ అందలేదు. అధికారిక గణాంకాల ప్రకారం నాలుగేళ్లలో 933 పక్కా గృహ నిర్మాణాల బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 దాకా నాలుగేళ్లలో విడతల వారిగా లబ్ధిదారులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు 933 పక్కా గృహాలు మంజూరు చేసింది. లబ్ధిదారులు ప్రభుత్వ సహాయం కంటే వారి స్థోమతను బట్టి గృహాలను నిర్మించుకున్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ఆ నాలుగేళ్లలో 309 ఇళ్లు పూర్తయి మరో 364 ఇళ్లు స్లాబ్ వరకు నిర్మాణం జరిగింది. ఇంకా 260 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలకు పూర్తిగా బిల్లులు నిలిపివేసింది. ఆలస్యంగా అయినా ప్రభుత్వం మంజూరు చేస్తుందనే ఆలోచనతో లబ్ధిదారులు ఎదురు చూశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరికి ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించిన పాపాన పోలేదు. పక్కా గృహాల నిర్మాణాల కోసం బడుగు బలహీన వర్గాల ప్రజలు అప్పులు చేసుకుని, మహిళల మెడలో ఉన్న కాస్తో కూస్తో నగలను తాకట్టు పెట్టుకొని మరీ ఇంటి నిర్మాణాలను కొనసాగించారు. వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా చేసినట్లు గత ప్రభుత్వ గృహనిర్మాణాల బిల్లులు నిలిపివేయడంతో బడుగు బలహీన వర్గాల ప్రజలు లబోదిబోమంటూ నెత్తినోరు కొట్టుకోసాగారు.పెండింగ్ బిల్లుల మంజూరు కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయారు. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఆ బిల్లులు గతి అంతే అని నిమ్మకున్నారు. కాగా గత యేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఆరు నెలలు గడిచిన తర్వాత 2014 నుంచి 2019 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసి వైసీపీ ప్రభుత్వంలో పెండింగ్ పడిన పక్కా గృహ నిర్మాణాల బిల్లులు మంజూరు చేస్తామని ప్రకటించడం పట్ల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. పెండింగ్ బిల్లులు మంజూరు అయితే గృహనిర్మాణం కోసం చేసిన అప్పులైనా తీరుచ్చుకోవచ్చునని ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం చెప్పిన ఆశ ఎప్పుడు తీరుతుందా అని ఎదురు చూస్తున్నారు. ఆ ప్రకటన వెలువడి ఆరు నెలలు గడిచిపోతున్నా బిల్లులు మంజూరు విషయం ఏమీ తెలియక పోవడంతో బిల్లులు వస్తాయా రావా అనే ఆందోళనలో పడిపోయారు. మరి ఎంత కాలానికి వస్తాయో అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై పెనగలూరు మండల హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్‌ను వివరణ కోరగా గత టీడీపీ ప్రభుత్వంలో దశలవారిగా నిర్మాణం జరిగిన గృహాల వివరాలను మినిట్స్ బుక్‌లో రికార్డు చేసి ఉంచామని, నిధులు విడుదలవుతానే ఇంటి నిర్మాణ దశను బట్టి బిల్లులు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

అభ్యర్థి ఎంపికపై ఇరు పార్టీల నాయకులు కసరత్తు

ఒంటిమిట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికపై ఇరుపార్టీల నాయకులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో మండలంలో రాజకీయవేడి అలుముకుంది. ఇరుపార్టీల నాయకులు ఎవరికి వారు అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యారు. రెండు రోజుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. ఎవరైతే గట్టి అభ్యర్థిగా ఉండగలరో వారిని ఎంపికచేయాలనే భావనతో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను నియోజకవర్గ స్థాయి నాయకులు అభ్యర్థుల ఎంపికై దృష్టి సారించారు. మంగళవారం రాజంపేట శాసనసభ్యుడు అమర్‌నాథ్‌రెడ్డి కడపలోని జిల్లా పరిషత్ చైర్మన్ అతిథి భవనంలో ముఖ్య నాయకులతో చర్చించారు. అలాగే ఒంటిమిట్టలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అభ్యర్థి ఎంపికపై కార్యకర్తలతో చర్చించారు. మంగళవారం సాయంత్రం రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మండల నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎవరైతే జడ్పీటీసీగా విజయం సాధించగలరు, వారి పేరును సూచించాలని కార్యకర్తలకు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి సుమారు ఏడుగురి పేర్లు వినిపిస్తున్నాయి. వైసీపీ నుంచి ఇద్దరు, ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. దీంతో ఇరుపార్టీల నాయకులు అభ్యర్థి ఎంపికపై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇరుపార్టీల నాయకులు ఇప్పటికే కొందరి జాబితాలను సిద్ధం చేసి అధిష్టానానికి పంపినట్లు తెలుస్తోంది. అధిష్టానం ఎవరికి టిక్కెట్ కేటాయిస్తుందోనన్న టెన్షన్లతో ఉన్నారు. నామినేషన్లు ప్రారంభం కావడంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగవంతం కావాల్సి ఉంది. గురువారం ఇరుపార్టీల అభ్యర్థులు ఎంపిక కావచ్చునని ఇరుపార్టీల నాయకులు చెబుతున్నారు.

వైద్యశాల స్థలం హద్దుల ఏర్పాటుకు సర్వే



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల స్థలం కబ్జా విషయమై హద్దుల ఏర్పాటుకు బుధవారం అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దారు తిరుమలబాబు ఆదేశాల మేరకు హద్దుల ఏర్పాటుకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ సోమశేఖర్ మాట్లాడుతూ మాధవరం హెల్త్‌సెంటర్ వైద్యాధికారి శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థల సేకరణ కోసం సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన స్థలంలో కొన్ని కట్టడాలు ఉన్నాయని, నిర్ధారణ చేసి మూడు రోజుల్లో నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, హెల్త్‌సెంటర్ అభివృద్ధి సలహామండలి చైర్మన్ సామా శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'శిక్షణా తరగతులను జయప్రదం చేయండి'

రాజంపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా కేంద్రంలో వచ్చేనెల 4, 5, 6 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, యువత, మేధావులు హాజరవుతారన్నారు. విద్యారంగ పరిస్థితులు, సోషల్ మీడియా ప్రభావం దాని ఫలితాలపై మేధావులు వివరించినట్లు తెలిపారు. కావున విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు హరినాథ్, వంశీ, సురేంద్ర, బాలు, రాహుల్ పాల్గొన్నారు.

వ్యాపారుల సిండికేట్‌తో తగ్గిన బొప్పాయి ధర



మాట్లాడుతున్న సీహెచ్ చంద్రశేఖర్

రాజంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు సిండికేట్ కావడంతోనే బొప్పాయి ధర తగ్గిందని, అలాంటివారిపై చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లా నాయకుడు పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మధ్య దళారులను నియంత్రించడానికి లైసెన్సులు లేనివారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం నాయకులు వై.ఆదినారాయణ, తుంగ శివకృష్ణ, మన్నూరు విశ్వనాథ్‌రెడ్డి, చరణ్, ఈశ్వరయ్య, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం అన్న ప్రసాద వితరణ

చిట్వేలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో పేదలకు అన్న ప్రసాదం వితరణగా అందించారు. ఈ మేరకు బుధవారం స్థానిక శివాలయం వద్ద యర్రంశెట్టి మస్తాన్‌రాయల్ తన స్నేహితుడి జ్ఞాపకార్థం యాచకులకు, పారిశుద్ధ్య కార్మికులకు అన్న ప్రసాదం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సాయిరాం, కార్యదర్శి మునిరావు, గౌరవ డైరెక్టర్ తురక రంగారెడ్డి, నరసరామయ్య, కామటం వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్లతో ఆరోగ్యం పదిలం

రాయచోటిటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): అవసరమైన వ్యాక్సిన్లు వేసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 100 మంది విద్యార్థులకు టిటానస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ టీటానస్ వ్యాక్సిన్ అనేది మనిషికి వచ్చే ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ టిటానస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ప్రమాదకరమైన అంటువ్యాధులను నివారించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు.హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, ఏఎన్ఎంలునందకుమారి, రమణమ్మ,అధ్యాపకులు ఇందిరప్రియదర్శిని, మేరీ మాధురి, నాగసురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి: ఎంపీడీవో



మట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

సంబేపల్లె, జూలై30(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఎంపీడీవో రామచంద్ర తెలియజేశారు.మండలంలోని నాగిరెడ్డిగారిపల్లె పీ4 సర్వేలో గుర్తించిన 20 కుటుంబాలను యువగళం కోఆర్డినేటర్ మండిపల్లి సిద్దారెడ్డి దత్తత తీసుకున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం ఆయన మొటుకువాండ్లపల్లె, బండకాడపల్లిల్లో బంగారు కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా దాత మండిపల్లి సిద్దారెడ్డి మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక జీవన స్థితిగతులను పెంచేందుకు సహకరిస్తానన్నారు. ప్రతి కుటుం బం ఉన్నంతలో సంతోషంగా ఉండేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే శక్తియాప్

రాజంపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత కోసం శక్తియాప్ పనిచేస్తుందని ఏఎస్ఐ వర్మ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తియాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శక్తి యాప్ ఏవిధంగా వాడాలి, ఎలా ఉపయోగించాలనే అంశాలపై వివరించారు. నేడు సైబర్‌క్రైమ్ విపరీతంగా పెరిగిందని, దానిపై ప్రతి ఒక్కరూ అ వగాహన కలిగి ఉండాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాన్, మహిళా పోలీసులు, కల్పన, రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ పంపిణీ

చిన్నమండెం, జూలై30(ఆంధ్రజ్యోతి): మహిళా రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర రవాణా,యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత చేతుల మీదుగా 30 మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీజీ) బుధవారం ఒక్కొక్క సంఘానికి రూ.10 వేల చొప్పున రివ్వాల్వింగ్ ఫండ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

జన సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి

చిన్నమండెం, జూలై30(ఆంధ్రజ్యోతి): జన సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నమండెం ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, పీఎంజేడీవై వంటి పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి జనధన్ యోజన అకౌంట్లు గురించి వివరించారు.

ప్రతి ఒక్కరూ గతస్మృతులను నెమరు వేసుకోవాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



శ్రీశివ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి

రామాపురం, జూలై30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గతస్మృతులను నెమరు వేసుకోవాలని, అందులోనూ విద్యార్థి జీవితం ఎంతో ప్రాధాన్యతగలదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొ న్నారు. బుధవారం శ్రీ శివ బీఎస్సీ నర్సింగ్ కాలేజీలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు ఏర్పాటు చేసుకున్న గెట్ టుగెదర్, ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ మన్నూరు భాస్కర్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ న్యాయం

చిన్నమండెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు

ఒంటిమిట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా కొత్తమాధవరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కార్యదర్శిగా పరిమిళ, సంయుక్త కార్యదర్శిగా సంధ్యారాణి, కోశాధికారిగా సునీల్, వీరితో పాటు కార్యవర్గ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. సంఘం అభివృద్ధికి సభ్యులంతా తోడ్పాడాలని ఆయన కోరారు.

విద్య ద్వారా ఉన్నత శిఖరాలు



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ముఖ్య అతిథులు

నందలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు పథకాలను అందిస్తున్నారన్నారు. నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత పదవులు పొందాలన్నారు. అనంతరం పదో తగరతిలో అఖిల్ ప్రథమ, ఆశిక్ ద్వితీయ, యేసు ప్రియ తృతీయ స్థానాల్లో, అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ మొబీనా, ద్వితీయ అక్షయ, తృతీయ గాయత్రిలకు రూ.5, 3, 2 వేల చొప్పున నగదు ప్రోత్సాహంతో పాటు మెమెంటోలను అందజేశారు. టీడీపీ నేత ధనంజయ్యనాయుడు మెమెంటోలను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ



చెక్కును అందజేస్తున్న సాయిలోకేశ్, బీజేపీ నాయకులు

రాజంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి ద్వారా దగ్గుపాటి పురందేశ్వరి సహకారంతో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ రాజంపేట మండలం మందరం గ్రామానికి చెందిన చాపల ఈశ్వరమ్మకు రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నరసింహరాజు, కృష్ణయాదవ్, సునీతానారాయణవర్మ, ప్రసాద్‌రెడ్డి, రమణయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

రామాపురం, జూలై30(ఆంధ్రజ్యోతి): రామాపురం మండలంలోని పొదుపు సంఘాల బలోపేతానికి వీవోఏలు కృషి చేయాలని ఏపీఎం దేవసేన అన్నారు. బుధవారం రామాపురంలోని వెలుగు కార్యాలయంలో వీవోఏల సమావేశంలో మాట్లాడుతూ పొదుపు సంఘాల వారు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. పొదుపు, రుణాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. శ్రీనిధి లోన్లు, బ్యాంకు లోన్లు, వ్యక్తిగత రుణాలు వంటివి స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్నారన్నారు. అవి సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాలు ఏర్పాటు చేసి పొదుపు, రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. సీసీలు నాగరాజు, నరసింహులు, రెడ్డిబాబు, గంగాధర, రాజు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

రాయచోటిటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సమస్యను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గణేశ్ మండల అభివృద్ధి అధికారి సురేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మోటారు కేబుల్ వైరు, పైపులను అందించి బోరుకు మరమ్మతులు చేయించారు.

పంటల నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సురేశ్‌బాబు

చిన్నమండెం, జూలై30 (ఆంధ్రజ్యోతి): పంటల నమోదు తప్పనిసరి అని రాయచోటి ఉద్యాన అధికారి సురేశ్‌బాబు అన్నారు. బుధవారం దేవగుడిపల్లె, మల్లూరు గ్రామ పంచాయతీల్లో పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ, జామ, దానిమ్మ, నేరేడు, టమోటా, మిరప, వంగ, పసుపు, కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు, పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్య పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది శిరీష, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నీటి వనరుల డేటాను సమగ్రంగా లెక్కించండి



కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు, జూలై30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఉన్న నీటి వనరుల డేటాను సమగ్రంగా లెక్కించి నమోదు చేయాలని మండల తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో వీఆర్‌వోలతో ఏడవ మైనర్ ఇరిగేషన్ సెన్సెస్, రెండవ వాటర్ బాడీస్ సెన్సెస్ పైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లోని నీటి వనరులు, బోరుబావులు, మామూలు బావులు, ఎన్ని ఉండేది వాటిల వివరాలను సమగ్రంగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. జనాభా గనణ ఆపరేషన్ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన మొబైల్ ఆధారిత యాప్‌ల సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాంమోహన్‌నాయక్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ జరిగిన పనులపై పోటీ నిర్మాణం

పెనగలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో మండల గ్రాంటు ద్వారా మూడు చోట్ల ఆరు లక్షల రూపాయలతో అగ్రిమెంట్ జరిగి చేపట్టాల్సిన పనులపై ఇదే గ్రామంలోని మరో వర్గం వారు ఏ గ్రాంటు ద్వారా నిధులు మం జూరు కాకపోయినప్పటికి అదే పనులు చేపట్టేందుకు కార్యక్రమాలు ప్రారంభించినట్లు అగ్రిమెంట్ కలిగిన వ్యక్తి వీఎల్‌సీ అధ్యక్షురాలు కె.భాగ్యమ్మ తెలిపారు. మండల గ్రాంటు ద్వారా ఒక్కో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షల వంతున మూడు పనులకు రూ.6 లక్షల రూపాయలు పంచాయతీ తీర్మాన ద్వారా అమోదం పొంది మండల పరిషత్ నిధులతో నిధులు మంజూరు చేయించుకుని పనులు చేపట్టేందుకు పంచాయతిరాజ్‌శాఖ ద్వా రా అగ్రిమెంట్ కార్యక్రమాలు కూడా జరిగాయన్నారు. ఇంతలో ఇదే గ్రామంలోని మరో వర్గం వ్యక్తులు తమ అగ్రిమెంట్ చేయించుకున్న పనుల స్థలంలో తమకు తెలియకుండా సన్న కంకర తోలి పనులు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పెనగలూరు ఎంపీడీవో ఎస్.విజయరావును వివరణ కోరగా గ్రామంలో చేపట్టాల్సిన మూడు సీసీ రోడ్ల నిర్మాణం కోసం మండల పరిషత్ నిధుల ద్వారా అగ్రిమెంట్ జరిగిన విషయం వాస్తవమేనన్నారు. పనుల నిర్మాణం కోసం అగ్రిమెంట్ చేసుకున్నవారే ఈ పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ గ్రామంలో అభివృద్ధి పనులు చేపడితే తమకు మంచిపేరు వస్తుందని రెండు వర్గాలవారు పోటీ పడుతున్నారన్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ కేతా చక్రపాణిని వివరణ కోరగా నిధులు మంజూరు చేయించుకుని అగ్రిమెంట్ చేయించుకునేవారే పనులు చేపట్టాల్సి ఉండగా నిధులు మంజూరు కాకపోయినా ఇంకో వర్గం వారు అదే పనులు చేపట్టాలని కోరుకోవడం చట్టవిరుద్ధమన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

పెనగలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కంబాలకుంటలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని గ్రామ పెద్ద ఎర్రంశెట్టి సుబ్బరాయుడు తెలిపారు. అనంతరం అన్నదానం రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయన్నారు.

రుచిగా.. శుచిగా..

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు తీరుపై అన్ని వర్గాల సంతృప్తి ● క్యారియర్లు తెచ్చుకోవడం లేదంటున్న విద్యార్థులు



కోడిగుడ్లు, చిక్కీలు తీసుకుంటున్న విద్యార్థులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ పూర్తిగా మార్చి వేసింది. దీంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో రుచిగా, శుచిగా వండిన అన్నం వడ్డిస్తున్నారు.



భోజనం చేస్తున్న విద్యార్థినులు

సుండుపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 70 ప్రాథమిక పాఠశాలలుండగా, సుమారు 3 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువు కుంటున్నారు. వారందరికీ క్రమం తప్పకుండా మెనూ ప్రకారం భోజనం అందించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుండడంపై ఉపాధ్యాయులతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూస్తున్నారు. పాఠశాలలను సందర్శించే ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భోజనం రుచి చూడాలని ఉపాధ్యాయులు, వంట మనుషులు కోరుతున్నారు.

భోజనం క్యారియర్లు బంద్

గత ప్రభుత్వంలో నాణ్యమైన బియ్యం సరఫరా, సకాలంలో వంట ఏజెన్సీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు నాణ్యమైన భోజనం అందేది కాదు. దాంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు ఇంటినుంచి క్యారియర్లలో భోజనం తెచ్చుకునేవారు. ప్రస్తుతం బడిలో పెట్టే భోజనం నాణ్యతతో పాటు రుచిగా సైతం ఉండడంతో ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకోవడం మానేశామని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరిట నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యతగా ఉండడంతో విద్యార్థులు ఇష్టపడి తింటున్నారు. అందుకే ప్రస్తుతం ఇంటి నుంచి క్యాయర్లు తెచ్చుకోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

హాజరుశాతం పెరుగుతోంది

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం వసతి ఉంది. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని చదువులోనూ రాణించాలి.

- రవీంద్రనాయక్, మండల విద్యాశాఖ అధికారి-2

కడుపునిండా తింటున్నాం..



గతంలో భోజనం తింటున్నా తృప్తి ఉండేది కాదు. ఇప్పుడు మేలు రకం బియ్యంతో వండి పెడుతున్నారు. దాంతో కడుపునిండా తింటున్నాం. ఇంట్లో భోజనం చేసిన అనుభూతి పొందుతున్నాము.

- అయాస్, షోయబ్, విద్యార్థులు

చాలా బాగుంది



గతంలో దొడ్డు బియ్యంతో చేసిన అన్నం పెట్టేవారు. ముద్దగా ఉండటంతో సరిగ్గా తినలేకపోయేవాళ్లం. ఇప్పుడు సన్న బియ్యంతో రుచిగా వండి పెడుతున్నారు. వారానికి ఐదు రోజులు కోడిగుడు, మూడు రోజులు చిక్కీ ఇస్తున్నారు.

- పార్వతీదేవి, 8వ తరగతి



సాంఘికశాస్త్ర క్లబ్...
సామాజిక చైతన్యానికి దిక్సూచి కావాలి

● విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు పెంపొందించాలి ● డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి వారిని చైతన్యవంతమైన పౌరులుగా సాంఘిక శాస్త్ర క్లబ్ తీర్చిదిద్దాలని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు సూచించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ సాంఘికశాస్త్ర క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చరిత్ర, రాజకీయ, భౌగోళిక శాస్త్రం, ఆర్థిక వ్యవస్థలపై అవగాహన పెంపొందించేలా క్లబ్ పని చేయాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు,విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడే కృత్యాధార బోధనకు క్లబ్ తోడ్పడాలన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధికి క్లబ్ తోడ్పడాలన్నారు. పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా సమకాలీన సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేలా క్లబ్ తన సేవలను అందించాలన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపగలిగే చైతన్యవంతమైన పౌరులను తయారు చేయడమే క్లబ్ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు బోధనాంశాల్లో క్లబ్ సహకరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఈ క్లబ్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, విద్యార్థులు దానిని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, శివభాస్కర్, గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, శివప్రసాద్, కేధర్నాధ్, ఉషామాధురి, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు
నివేదికలు సిద్ధం చేయండి

● సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎంత భూమి అవసరం, ఎంత పెట్టుబడి పెట్టాలి, ఎంతమంది కార్మికులు కావాలి తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ మార్కెటింగ్, హార్టికల్చర్, ఇండస్ట్రియల్, వ్యవసాయ శాఖాధికారులతో సబ్‌కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మదనపల్లె మార్కెట్‌ను పరిశీలించి అప్పట్లో అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. ముఖ్యంగా టమోట ధరలు పడిపోయి, గిట్టుబాటు కూడా రాని సమయంలో రైతులను ఆదుకోవడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారన్నారు. ఇందులో భాగంగా రెండో సారి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. టమోట గుజ్జు పరిశ్రమను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలచే నిర్వహించడంపై ఆలోచించాలన్నారు. కుటీర పరిశ్రమగా గుజ్జు పరిశ్రమలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మదనపల్లె టమోట మార్కెట్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వలన సీజన్‌లో ఎక్కువ సంఖ్యలో లారీలు వస్తే ఇబ్బందులు వస్తున్నాయని, టమోటా మార్కెట్‌ను పట్టణం వెలుపలకు మార్చేందుకు, ఎంత భూమి అవసరం ఉంటుందో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఉద్యానశాఖ జిల్లా అధికారిణి సుభాషిణి, హెచ్‌వో ఈశ్వరప్రసాదరెడ్డి, మార్కెట్ కార్యదర్శి జగదీశ్, అభిలాష్, ఏవో నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్ల భూబాగోతం!

● అక్రమ మ్యుటేషన్లు, వెబ్‌ల్యాండ్‌లో నమోదుపై విచారణకు జేసీకి ఆదేశాలు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్ల భూబాగోతంపై జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలసపాడు మండలంలోని కలసపాడు, శంకవరం, మామిళ్ళపల్లె గ్రామాల్లోని వివిధ సర్వే నంబర్లలోని 45.94 ఎకరాల డీకేటీ భూములను ఆరుగురి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు నమోదు చేసినట్లు ప్రధాన ఆరోపణ. అప్పట్లో తహసీల్దారుగా పనిచేసిన ఎం.మోహన్ (ప్రస్తుతం రిటైర్డు), ఆ తరువాత ఇన్‌చార్జీ తహసీల్దారుగా వ్యవహరించిన డిప్యూటీ తహసీల్దారు ఎన్.నాగవాహిణిలు కుట్రపూరితంగా వ్యవహరించినట్లు పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పటి బద్వేలు డివిజన్ ఆర్డీవో విచారణ రికార్డులను పరిశీలించి 2022 డిసెంబరు 10 నివేదిక సమర్పించారు. అక్రమాలకు పాల్పడ్డ తహసీల్దార్లపై చర్యలు తీసుకోవలసిందిగా ఆర్డీవో సిఫారసు చేశారు. 2023 జనవరి 26న కలెక్టరు ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదికల ప్రకారం పెద్దిరెడ్డి పురుషోత్తం రెడ్డి, పెద్దిరెడ్డి సావిత్రి పేర్లతో 21.22 ఎకరాలు, పెద్దిరెడ్డి మునిరెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మిదేవి పేర్లతో 15.92 ఎకరాలు, పెద్దిరెడ్డి పెద్దవెంకటసుబ్బారెడ్డి పేరుతో 4.90 ఎకరాలు, పెద్దిరెడ్డి హైమవతి పేరుతో 3.90 ఎకరాల డీకేటీ భూములను నిబంధనలను అతిక్రమించి ఇద్దరు తహసీల్దార్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు ఈ నివేదికలు తేల్చాయి. ప్రతి సర్వే నంబరును ఏ తేదీన, ఏ తహసీల్దారు, ఎవరి పేరుతో మ్యుటేషన్ చేసి వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసినట్లు పూర్తి వివరాలతో వెల్లడించారు. డీకేటీ రిజిస్టరులో నంబర్లను తారుమారు చేయడం, అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా తదుపరి కార్యాచరణకు పూనుకోవడం తీవ్రమైన చర్యగా పేర్కొన్నారు. ఈ నివేదికల ఆధారంగా 2023 జూన్ 16న తహసీల్దార్లు మోహన్, నాగవాహినిలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పది రోజుల్లోగా వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. 2024లో ఇరువురూ తమ వాదనలను ప్రభుత్వానికి సమర్పించారు. వీటితో ఏకీభవించని ప్రభుత్వం ఈ మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమించారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక ప్రభుత్వాని పంపాల్సిందిగా జేసీకి సూచించారు. విచారణలో జేసీకి సహకరించడానికి బద్వేలు ఆర్డీవోను ప్రెజెంటింగ్ అధికారిగా కూడా నియమిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

చీనీ, నిమ్మ మొక్కలు పంపిణీకి సిద్ధం



చీనీ, నిమ్మ మొక్కలకు అంటు కడుతున్న కూలీలు

రైల్వేకోడూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యాన మోడల్ నర్సరీలో రైతులకు అందుబాటులో నాణ్యమైన చీని, నిమ్మ మొక్కలు ఉన్నట్లు బుధవారం రైల్వేకోడూరు ఉద్యాన శాఖ నర్సరీ అధికారి బి. లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో చీనీ, నిమ్మ తోటలలో చీడపీడల ఉధృతి పెరగడంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందన్నారు. ఈ సమస్యను అధికమించడానికి రైతులకు మే లైన, నాణ్యమైన మొక్కలను ప్రభుత్వ నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని రైతులకు తెలిపామన్నారు. మొక్కల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని, చీనీలో అయితే రంగాపూర్ మీద అంటు కట్టిన రెండు నుంచి రెండున్న అడుగుల ఎత్తు కల్గి, నాలుగైదు ఆరోగ్యకరమైన కొమ్మల నుంచి రెండున్నర నుంచి మూడున్నర సెంటీమీటర్ల మందం కలిగిన మొక్కలను ఎంపిక చేసుకోవడం వలన చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులను పొందవచ్చునని తెలిపారు. ఉద్యాన రైతులకు నాణ్యమైన మొక్కలను అందించే ఉద్దేశంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఏపీ మోడల్ నర్సరీలో రంగాపూర్ మొలకలపై కట్టిన 80 వేల చీనీ మొక్కలు, 15 వేల నిమ్మ మొక్క లు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఒక్కో చీని మొక్క రూ. 55లు, నిమ్మ మొక్క రూ. 25కు ఇవ్వనున్నామని తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద మొక్కలను ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఉద్యానశాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన మొక్కలను ఎంపిక చేసుకొని సాగు చేయడం ద్వారా సుమారు 30 ఏళ్ల వరకు కూడా చీని, నిమ్మ చెట్ల ద్వారా రైతులు దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నామని తెలిపారు.

స్పందనలో ఫిర్యాదు చేశారని దాడి



మాట్లాడుతున్న తెలుగు యువత నేత ఆంజనేయులునాయుడు

సుండుపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్పందనలో ఫిర్యాదు చేశామని అరుణ్‌కుమార్, మరికొంత మంది తమపై దాడి చేశారని తెలుగు యువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంజనేయులు నాయుడు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో నకిలీ పింఛన్లతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని, సర్వే నెంబర్ 731-4లో గల ప్రభుత్వ భూమి (గయాలు) ఆక్రమణ కు గురవుతోందని, జూలై 7 న స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. బుధవారం కొలతల కోసం రెవెన్యూ అధికారులు రావడంతో అక్కడికి వెళ్లిన తమపై దాడి చేశారన్నారు. గ్రామస్తులతో పాటు బయటి ప్రాంతాల నుండి మనసులను తీసుకువచ్చి దాడికి యత్నించారన్నారు. దీంతో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబునాయుడు, కిరణ్ నాయుడు, కోనంకి రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రామాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో స్కూటర్‌పై వెళుతున్న దంపతులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కడప ఐటీఐకి చెందిన మహబూబ్‌బాషా తన భార్య మహబూబ్ జాన్‌తో కలసి స్కూటర్‌పై కడప నుంచి రాయచోటికి వెళుతుండగా గువ్వలచెరువు బస్టాండు సమీపంలో లారీ ఢీకొంది. సమాచారం అందుకున్న రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడినవారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ● మహిళా సంఘాల సభ్యులకు గుడ్లు విక్రయించే బండ్ల పంపిణీ



గుడ్ల బండిని అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్

రాయచోటి కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమైందని, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం 50 వేల రూపాయల విలువైన గుడ్ల అమ్మకపు బండిని జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నమయ్య జిల్లాలోని ఎంపిక చేసిన పది మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి చెందడానికి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని ఆ కృషి ఫలాలను నేడు రాష్ట్రంలోని స్వయంసహాయ సంఘాల ద్వారా మహిళలందరూ పొందుతున్నారన్నారు. ప్రస్తుతం అందజేసిన గుడ్ల అమ్మకపు బండ్లు పౌష్టికాహారంతో పాటు గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తేవడం, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగించడం అనే రెండు లక్ష్యాలతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, జాతీయ గుడ్డు సమన్వయ కమిటీతో కదుర్చుకున్న అవగాహన ఒప్పందం మేరకు ఈ బండ్లు పంపిణీ చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మొత్తం 1000 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని ఒక్కొక్క సభ్యురాలికి ఒక గుడ్డు అమ్మకపు బండి చొప్పున మొత్తం 1000 బండ్లను సరఫరా చేయనున్నారన్నారు. మొదటి దశలో అన్నమయ్య జిల్లాకు 10 బండ్లు కేటాయించగా, వీటిని ఈ రోజు లబ్దిదారులకు అందజేశామన్నారు. ఈ లబ్దిదారులకు గుడ్లతో చేసే రకరకాల వంటకాలపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం శిక్షణ ఇస్తుందని, దీంతో అదనంగా దాదాపు 20,820 రూపాయల లబ్ధి చేకూరనుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల శాంతి కల్యాణం

● హనుమంతుడిపై రాముడి నగరోత్సవం



సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, జూలై 30: పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవచేశారు. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో ఊంజల్‌సేవ, రాత్రికి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల శాంతి కల్యాణం చేశారు. చివరగా ముస్తాబైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్, ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు, వేదపండితులు కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోకుల్, బాషికాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిషేక మహోత్సవాల్లో నేడు..

రాముడి పట్టాభిషేక మహోత్సవాలలో గురువారం ఉదయం స్నపన తిరుమంజనం, రాముడి పట్టాభిషేకం, ఊంజల్‌సేవ, రాత్రికి గరుడవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

జమ్మలమడుగు డీఎల్డీవోగా రామాంజనేయులు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా వి.రామాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 జనవరి 17న ఆయన అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్లిన ఆయనను మాతృ సంస్థకు పంపుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు ఉత్తర్వులిచ్చారు. దీంతో రామాంజనేయులు పోస్టింగ్ కోసం పంచాయతీ రాజ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం రామాంజనేయులును జమ్మలమడుగు డీఎల్డీవోగా నియమిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.



ఉపాధిహామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్

గోకులాల్లో.. గోల్‌మాల్!

● బినామీ పేర్లతో అనర్హులకు..
● ఉపాధిహామీ పనుల్లో భారీగా అవినీతి ..
● సామాజిక తనిఖీలో బహిర్గతమయ్యేనా ?

పాడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులాల నిర్మాణాల్లో అవినీతి పేరుకుపోయింది. రైతుల పేరుతో అనర్హులకు మంజూరు చేయడంతోపాటు, నిధులను ఇతరులు ఖాతాలోకి మళ్లించి స్వాహా చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుర్రంకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలానికి ఉపాధిహామీ పథకం కింది 58 గోకులం షెడ్లు మంజూరు కాగా 55 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ షెడ్లను పాడి రైతులకు మాత్రమే కేటాయించాల్సి ఉండగా, పలువురు అనర్హులు సొంతం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఉపాధిహామీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇలాంటివారు గోకులాల నిర్మాణంలో ప్రభుత్వం నిబంధనలు అతిక్రమించినా, పూర్తిస్థాయిలో బిల్లులను చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక తనిఖీ బృందం పనులను తనిఖీ చేయనుండడంతో అవినీతికి పాల్పడిన సిబ్బంది తమను కాపాడాలంటూ రైతులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులను నిష్పక్షపాతంగా తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను వెలికితీయాలని కూలీలు, రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీవో జయరామిరెడ్డి మాట్లాడుతూ గోకులాల షెడ్లను పాడి రైతులే నిర్మించుకున్నారు. బినామీ పేర్లతో గోకులాలను నిర్మించుకున్నట్లు తమ దృష్టికీ రాలేదన్నారు. అలా ఎవరైనా బినామీ పేర్లతో గోకులాలను నిర్మించుకుని ఉంటే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైవీయూ వీసీ కోసం సెర్చ్ కమిటీ ఏర్పాటు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్శిటీకి వైస్ చాన్సలర్ నియామకం కోసం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ (సెలెక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీ నియమాకం కోసం అర్హతలు కలిగిన ముగ్గురు పేర్లను సూచించాల్సిందిగా సెర్చ్ కమిటీని ప్రభుత్వం కోరింది. ప్యానల్ సభ్యుల పేర్లను ప్రాధాన్యత ప్రకారం అక్షర క్రమంలో పేర్కొని జాబితాను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా కమిటీని కోరింది. సెర్చ్ కమిటీ సిఫారసులను తదుపరి వీసీ నియామకం కోసం గవర్నరుకు ప్రభుత్వం పంపాల్సి ఉందని తెలిపింది. సెర్చ్ కమిటీలో ప్రభుత్వ నామినీగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి. జార్జి విక్టర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా రాయలసీమ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.వి. ప్రసాద్ రావు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీగా సిమ్లాలోని హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియోగ్రఫీ ప్రస్తుత చైర్మన్, మండి సర్దార్ పటేల్ యూనివర్శిటీ మాజీ వీసీ దేవ్‌దత్ శర్మలను సభ్యులుగా నియమించారు. ప్రభుత్వ నామినీగా నియమితుడైన సభ్యుడు కమిటీ చైర్మన్‌గా వ్యవరిస్తారని, వీలైనంత తొందరగా వీసీ నియామకం కోసం అవసరమైన సమావేశాలను నిర్వహించాలని పేర్కొంటూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి

తంబళ్లపల్లె, జూలై 30(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలని డీపీవో రాధమ్మ సూచించారు. బుధవారం డీఎల్‌పీవో నాగరాజుతో కలిసి రేణుమాకులపల్లెలో ఆమె పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, చెత్త సంపద కేంద్రం, మురుగు కాలువలు, తాగు నీరు, వీధి దీపాలను పరిశీలించారు చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని స్థానికులకు సూచించారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి జితేంద్రనాయక్ పాల్గొన్నారు.


APK... క్లిక్ చేస్తే

ఏపీకే అనేది ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉపయోగించే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి ఉపయోగించే ఫైల్ ఫార్మాట్. సైబర్ నేరస్థులు హానికరమైన ఏపీకే ఫైల్‌లను సృష్టించి వాటిని సోషల్‌మీడియా, మెసేజింగ్ యాప్‌ల ద్వారా పంపుతారు. ఈఫైల్‌లు నమ్మదగిన యాప్‌ల మాదిరిగానే కనిపిస్తాయి. కానీ అవి మాల్వేర్‌ను కలిగి.. వినియో గదారుల ఫోన్‌లను హ్యాక్ చేయడానికి ఉపయోగిస్తారు.

- లింక్ టచ్ చేస్తే.. డేటా సైబర్ నేరగాళ్ల చేతిలోకే
- అప్రమత్తంగా లేకపోతే క్షణాల్లో ఖాతా ఖాళీ



కడప క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేటి డిజిటల్ ప్రపంచంలో మొబైల్ యాప్‌లు మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారాయి. అయితే, గూగుల్, ప్లేస్టోర్ వెలుపుల యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు మీకు తరచుగా ఏపీకే అనే ఫైల్ ఫార్మాట్ తారసపడవచ్చు. చాలా మంది యూజర్లు ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయడానికి సంకోచిస్తుంటారు. ఇది హ్యాకింగ్‌కు లేదా బ్యాంక్ ఖాతా మోసాలకు దారితీయవచ్చని భయపడుతుంటారు. ఏపీకే ఫైల్ అంటే ఏమిటి... దాని ప్రాముఖ్యత ఏంటి, దాంతో వ్యవహరించేటప్పుడు ఎందుకు జాగ్రత్త అవసరమో సైబర్ క్రైం పోలీసులు చెబుతున్న వివరాలు తెలుసుకుందాం.



సైబర్ నేరగాళ్లు వాట్సప్ గ్రూపుల్లో పంపిన లింకులు

ఏపీకే మోసాలు ఇలా..

ఏపీకే అంటే ఆన్‌లైన్ ప్యాకేజీ కిట్ అని అర్థం. హ్యాకింగ్ చేసేందుకు ఉపయోగించే ఒక అప్లికేషన్ ఇది. ఎక్కువగా బ్యాంక్ పేర్లపై ప్రభుత్వానికి చెంది న స్కీముల పేరుతో పంపిస్తారు. వాట్సప్ ద్వారా పంపించారంటే పొరపాటున అది క్లిక్ చేస్తే మీ డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల లాగేసుకుంటారు. తరువాత మన గ్రూపులో ఉన్న వాట్సప్ నంబర్‌లకు పంపిస్తారు. వారు ఎవరైనా క్లిక్ చేస్తే ఖాతా లో డబ్బు కాజేస్తారు.

ప్రస్తుతం ఏపీకే అప్లికేషన్ మోసాలు ఎక్కువయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడు నెలల్లో 94 ఫిర్యాదులు రాగా 96 లక్షలు డబ్బులను సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. దీన్ని బట్టి మోసపోయే వారు ఎలా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి మోసాలకు పాల్పడే అవ కాశం ఉండదు.

జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు..

- ఇటీవల జిల్లాలో ఏపీకే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన ఓ ఉద్యోగికి పీఎం కిసాన్ పేరుతో లింకులు పంపించారు. దీంతో ఆయన ఆ లింక్ క్లిక్ చేయడంతో రూ.81 వేలు పోగొట్టుకున్నారు.
- సీకేదిన్నె మండలానికి చెందిన ఓ విద్యార్థి ఏపీకే లింక్ పంపి రూ.8వేలు కాజేశారు.
- కడప చెందిన ఓ మహిళకు ఎస్‌బీఐ యూనో లింక్ పంపించారు. ఆమె ఆ లింకును క్లిక్ చేయడంతో రూ.30 వేలు పోగొట్టుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సొమ్ము సేఫ్‌గా ఉంటుందని సైబర్ క్రైం పోలీసు అధికారులు చెబుతున్నారు.

పరివర్తన రావడానికి చర్యలు : డీఈవో


ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో షంషుద్దీన్

కమలాపురం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారిలో పరివర్తన రావడానికి చర్యలు తప్పవని డీఈవో షంషుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని పెద్దచెప్పలి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మంగళవారం మద్యం తాగి స్కూలుకు రావడంతో జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి వెంటనే సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ అధికారి డీఈవో షంషుద్దీన్ బుధవారం హైస్కూలుకు చేరుకుని ఉపాధ్యాయులను విచారించారు. ఇలాంటి తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

వైవీయూ అధ్యాపక సంఘ నూతన కార్యవర్గం


అధ్యాపక సంఘం నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ ఎన్.ఈశ్వరరెడ్డి ప్రకటించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల అంగీకారం మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా వృక్షశాఖ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తెలుగుశాఖ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎం వినోదిని, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎల్.మాధవి, డాక్టర్ వి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె.మృత్యుంజయరావు, కోశాధికారిగా డాక్టర్ జయంతి కళ్యాణ్‌లను ఎన్నుకున్నారు. పాలకమండలి సభ్యులుగా డాక్టర్ ఎ.శ్రీధర్‌బాబు, ఆచార్య మెర్సీ విజేత, డాక్టర్ వీవీ వెంకటరాము, డాక్టర్ వరప్రభాకర్, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ గణేష్‌నాయక్, డాక్టర్ వి.లాజర్, డాక్టర్ గంజి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల నుంచి ఒక సంయుక్త కార్యదర్శి, ఒక పాలకమండలి సభ్యుడు ఉంటారని తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల కాలపరిమితితో పనిచేస్తాయన్నారు.

పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం

- ఆరోపించిన బాధితులు

కడప క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వేధింపులతో తమ సోదరుడు ఆర్.చిన్న బాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతడి సోదరులు ఏసన్న, బాలయ్య తెలిపారు. బుధవారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. కొండాపురం మండలం సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన ఆర్.చిన్నబాలయ్య (45)ను పోలీసులు వేధిస్తున్నారని అన్నారు. తమకు చాలా కాలం క్రితం ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని అయితే ఆ స్థలాన్ని ఓ హోంగార్డు, కానిస్టేబుల్ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీనిని అడ్డుకున్నందుకు తమ సోదరుడిపై తప్పుడు కేసులు పెడుతున్నారని వాపోయారు. దీంతో మనస్థాపం చెంది చిన్నబాలయ్య మంగళవారం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వెంటనే కడప రిమ్స్‌కు తీసుకొచ్చామన్నారు. మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తీసుకుపోతు న్నామని, తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తాళ్లప్రొద్దుటూరు పోలీసులను వివరణ కోరగా చిన్నబాలయ్యపై తాళ్లప్రొద్దుటూరులోనే ఐదు కేసులు నమోదయ్యాయని సీకేదిన్నె, తలమంచిపట్నం పోలీస్ స్టేషన్లలో కూడా కేసులున్నాయని అన్నారు. అతడు నేరాలకు పాల్పడ్డంతోనే కేసులు నమోదు చేశామని తెలిపారు.

గ్రామ సుపరిపాలనలో జడ్పీటీసీల పాత్ర కీలకం

- జడ్పీ సీఈవో ఓబులమ్మ


మహిళా జడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ సుపరిపాలనలో జడ్పీటీసీలు కీలక పాత్ర వహించాలని జడ్పీ సీఈవో, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ సి.ఓబులమ్మ పేర్కొన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ)లో మహిళా జడ్పీటీసీలకు రెండో రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు ఈ శిక్షణకు 25 మంది మహిళా జడ్పీటీసీలకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. రెండోరో జు బుధవారం మాత్రం 14 మంది హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి సీఈవో ఓబులమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళల భాగస్వామ్యం, న్యాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణను కల్పిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళల స్వశక్తీకరణ మరింతగా పెరగాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి బలమైన ఆధారంగా నిలుస్తోందన్నారు. ప్రజలే నిర్ణయాలలో భాగస్వాములు కావడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. గ్రామీణ భవిష్యత్ నిర్మాణంలో మహిళా జడ్పీటీసీల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. తమరోజువారి పనుల్లో ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలకు పరిష్కార మార్గం చూప డానికి ఈ శిక్షణా మాడ్యూల్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా మహిళా జడ్పీటీసీలకు సుస్థిరమైన సాధికారత కలుగుతుందన్నారు. మరిం త ధైర్యంగా, నమ్మకంగా నాయకత్వ బాధ్యతలు తీసుకునే స్థితిలోకి వస్తారన్నారు. తమ నైపుణ్యాలపై అవగాహనను పెంచుకుంటూ గ్రామ అభివృద్ధిని ముందుండి నడిపించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉంటారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు దోహద పడుతుందన్నారు.

కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ఏవో బండపల్లి నాగభూషణం, మాస్టర్ ట్రైనర్స్, మహిళా జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి రూ.8.94 లక్షల ఆదాయం

సీకేదిన్నె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గంగమ్మ గుడికి రూ.8,94,500 వేలం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలంలో షామియానా, కుర్చీలు, టేబుళ్లకు ఆజాద్‌నగర్‌కు చెందిన ఎ.వెంకటసుబ్బయ్య రూ.5.80లక్షలకు దక్కించుకున్నారన్నారు. కూల్‌డ్రింక్ షాపునకు ప్రొద్దుటూరుకు చెందిన ఎం.వెంకటరమణ రూ.1.86 లక్షలకు, పూలు, పూజా సామాగ్రి కడప అక్కాయపల్లెకు చెందిన ఎం.పవన్‌కల్యాణ్ రూ.1.22 లక్షలకు, చెప్పులస్టాండు కె.పెద్దఓబులేసు రూ.6,500లకు దక్కించుకున్నారన్నారు. వీరికి ఆగస్టు 1 నుంచి వచ్చే సంవత్సరం జూలై 31 వరకు హక్కులు కల్పించామని ఈవో తెలిపారు.

బ్రౌన్ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలన

కడప కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వ విద్యాలయ అనుబంధ సంస్థ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య అల్లంశ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఎర్రముక్క పల్లెలో గల సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం వెనుకభాగంలో రూ.3.6 కోట్లతో పనులను సాగుతున్నాయి. కార్యక్రమంలో ఆ కేంద్రం సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఇనుపగేటు మీదపడి చిన్నారి మృతి


అనుశ్రీ (ఫైల్ ఫొటో)

ముద్దనూరు జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న ఇనుపగేటు మీదపడటంతో చిన్నారి అనుశ్రీ(7)మృతి చెందింది.స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. తొండూరు మండలం ఊడవగాండ్ల గ్రామానికి చెందిన గాయత్రీ ప్రసవానికి తల్లిగారింటికి నల్లబల్లెకు ఒక్కగానొక కూతురు అనుశ్రీతో వచ్చింది. సాయంత్రం ఆడుకుంటుండగా ఇంటిముందున్న ఇనుప గేటు ఊడి చిన్నారిపై పడింది. తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న చిన్నారి మరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

మృతుని కుటుంబానికి ఎన్‌ఆర్ఐ చేయూత

- ప్రవాస భారతీయుడు రూ.లక్ష విరాళం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం


నగదును అందజేస్తున్న ఎంపీడీవో రామచంద్రయ్య, సర్పంచ్ బీబీ

దువ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది డిసెంబరు 20వ తేదీన ప్రచురితమైంది. అప్పట్లోనే అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ ఈ విషయమై వాకబు చేశారు. మృతుని కుటుంబ పరిస్థితి తెలుసుకుని ఇండియాకు వచ్చినప్పుడు ఏదో ఒకరూపంలో సాయం చేస్తానని అప్పట్లో ఎన్ఆర్ఐ మాట ఇచ్చారు. ఈ ప్రకారం రూ.లక్ష నగదు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చి సదరు కుటుంబానికి అందజేయమన్నారు. ఈ మేరకు దువ్వూరు మండలం కానగూడూరు గ్రామానికి చెందిన మల్లేష్ భార్య సుమలత వారి పిల్లలను పిలిపించి స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీడీవో రామకృష్ణయ్య, అక్కడి సర్పంచ్ బీబీ చేతుల మీదుగా నగదును బుధవారం అందజేశారు. పోస్టాఫీస్ బీపీఎం ప్రసాద్‌ను పిలిపించి మృతుని నలుగురు కూతుర్ల పేరుమీద నగదును డిపాజిట్ చేయమని ఎంపీడీవో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వే ఉద్దేశ్యం ఇదేనని, పేదరికం పారదోలేందుకు గ్రామాలను దత్తత తీసుకుని ఆర్థిక, మాటసాయం, వస్తు రూపేణా తోడ్పడటం పీ4 లక్ష్యమన్నారు. ఈ సాయం పి4 సర్వేకు దగ్గరగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, గ్రామ వీఆర్వో, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



లింగాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం ఎర్రమేకల భరత్‌కుమార్ (23) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... భరత్‌కుమార్ కొన్ని సంవత్సరాల నుంచి కంటి సమస్య, మైగ్రేన్ తలనొప్పి తదితర సమస్యలతో బాధపడుతుండేవాడు. ఆరోగ్య సమస్యలను భరించలేక, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

చాపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఖాజీపేటకు చెందిన సుంకు వెంకట మీనాక్షి అనే విద్యార్థిని ఈ నెల 29న మంగళవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఓ ప్రైవేటు కాలేజీలో మీనాక్షి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికిరాలేదు. ఈ మేర కు విద్యార్థిని తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకుల వీధిలో చోరీ

కడపక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆకుల వీధిలో ఈనెల 29న గుర్తు తెలియని దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి 7 తులాల బంగారు అపహరించినట్లు టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆకుల వీధిలో నివాసం ఉంటున్న షేక్ తస్లీమ్ అనే మహిళ మంగళవారం పుట్టింటికి వెళ్లిందని, తిరిగి బుధవారం వచ్చే లోపు ఇంటి తాళాలు తెరచి ఉండడంతో ఇంట్లో బీరువాను పరిశీలించగా అందులో ఉన్న 7 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఇలియాస్ బాష, రాళ్లపల్లె అబ్దుల్లాలు డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయ డానికి ముందస్తు సమావేశం నిర్వహించారు.

3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఆగస్టు 3వ తేదీ ఆదివారం ఉదయం జిల్లాస్థాయి అండర్-14, 16 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్ బాష తెలిపారు. అండర్-14 విభాగంలో బాలబాలికలకు 60 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-16 విభాగంలో బాలబాలికలకు 60, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచినవారు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఆధార్, బర్త్‌సర్టిఫికెట్‌ను తీసుకురావాలని కోరారు

ప్రాచీన కళలను కాపాడుకునేందుకు చొరవ చూపాలి : ఎమ్మెల్సీ


ఎమ్మెల్సీకి తోలుబొమ్మను బహూకరిస్తున్న కుళాయప్ప

పులివెందుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనకళలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పులివెందులలోని ఆయన స్వగృహంలో హస్తకళల విభాగంలో జాతీయ అవార్డులను పొందిన దలవాయి కులాయప్ప ఎమ్మెల్సీని కలిశారు. తోలు బొమ్మను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలో తోలుబొమ్మ కళాకారులైన తల్లీకొడుకులైన దలవాయి శివమ్మ, దలవాయి కులాయప్పలు హస్తకళల విభాగంలో ఇటీవల జాతీయ అవార్డులను పొందారన్నారు. ప్రాచీక కళలు అంతరించిపోకుండా శ్రీకృష్ణ చరిత విశ్వరూపహనుమాన్ వంటి కళాఖండాలను రూపొందించి ఆదర్శంగా నిలిచారన్నారు. తల్లీకొడుకులకు జాతీయ అవార్డు రావడంతో ఎమ్మెల్సీ వారిని అభినం దించారు. దేశస్థాయిలో ఆంధ్ర రాష్ట్రానికి ఖ్యాతితెచ్చినందుకు వారిని ప్రశంసించారు.

హోరాహోరీగా సాగుతున్న మల్టీడే క్రికెట్ పోటీలు



ఆదినారాయణ (అనంతపురం), రుత్విక్‌కళ్యాణ్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా రెండో రోజైన బుధవారం పోటీలు సాగాయి. అనంతపురం జట్టు కడప జట్టుపై 270 పరుగులు ఆధిక్యత సాధించగా.. మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు చిత్తూరు జట్టుపై 25 పరుగుల స్వల్ప వెనుకంజలో నిలిచింది. వివరాలిలా... కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్లు మధ్య మ్యాచ్ సాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో అనంతపురం జట్టు 53.1 ఓవర్లలో 186 పరుగులకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజైన బుధవారం తిరిగి బ్యాటింగ్ ప్రారంభించి 53.3 ఓవర్లలో 158 పరుగులకు కుప్పకూలింది. దీంతో అనంతపురం జట్టుకు 28 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధ్యిత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 242 పరుగులు సాధించింది. ఇందులో ఆదినారాయణ 118 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో ఇప్పటి వరకు 270 పరుగుల ఆధిక్యత సాధించి పటిష్ఠ స్థితికి చేరుకుంది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటిరోజు తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 92.1 ఓవర్లలో 325 పరుగులు భారీ స్కోరుకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 44 పరుగులతో తిరిగి బ్యాటింగ్ చేపట్టిన కర్నూలు జట్టు 100 ఓవర్ల పాటు ఆడి 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. ఇందులో రుత్విక్ కళ్యాణ్ 90 పరుగులు చేశాడు. దీంతో కర్నూలు జట్టు మరో 25 పరుగుల స్వల్ప వెనుకంజలో ఉంది.

రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే


సుభాష్‌రోడ్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 9వ వార్డు సుభాష్‌రోడ్డులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో చితికిపోయిన రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లి వేలాది కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. ఈ పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన రెండు విధాలుగా ఉపయోగముంటుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌కే రామకృష్ణాచారి, బాబునాయుడు, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహాలను పూర్తి చేయాలి

● డీఈఈ దీనదయాల్ రాజ్

నిమ్మనపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో వున్న ప్రభుత్వ గృహాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈఈ దీనదయాల్‌రాజ్, ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 2078 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 18 ఇళ్లు వివిధ కారణాలతో రద్దయ్యాయని, ఇప్పటి వరకు 1695 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన 386 ఇళ్లు వివిధ దశల్లో వున్నాయని వాటిని పూర్తి చేయాలని తెలిపారు. వారం రోజుల్లోగా ప్రతి లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, ఎంసీవో గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు సీఐ పరామర్శ


వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు

బి.కొత్తకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం వుంటూ అనారోగ్యంతో బాధపడుతున్న మునెమ్మ(80), క్రిష్ణప్ప దంపతులను స్థానిక సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పరామర్శించి, వారి ఇబ్బందులను ఆరా తీశారు. మునెమ్మ మంచం పట్టడంతో నెలసరి మందులకు రూ.10 వేల వరకు కావాల్సి వస్తోందని, డబ్బులు లేక నరకయాతన పడుతున్నట్లు వారు వాపోయారు. నలుగురు కుమారులు వుండి కూడా అందుబాటులో ఒక్కరూ లేకపోవడంతో వృద్ధుల స్థితి చూసి అండగా వుంటామని హామీనిచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సదరం సర్టిఫికెట్, పింఛను వచ్చేలా చూస్తామన్నారు. ఆ దంపతులు సీఐకి ధన్యవాదాలు తెలిపారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు యుగంధర్

ములకలచెరువు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్, జిల్లా ఇన్‌చార్జిలు మిద్దేపల్లి బాలాజీ, వెంకటరమణ పిలుపునిచ్చారు. ములకలచెరువులో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ అధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సాయశక్తుల కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, నాయకులు వినోద్, భాస్కర్, మధు, మహేష్, అంజి, రేష్, మల్లప్ప, నరసింహులు, శ్రీరాములు, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు ప్రాధాన్యత ఇవ్వాలి


డీఏవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 పథకంలో బంగారు కుటుంబాల ఎంపికలో అధికారులు వాల్మీకులకు ప్రాధాన్యత ఇవ్వాలని వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు కోరారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ డీఏవో నిర్మలాదేవిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నిరుపేదలపై వాల్మీకుల కుటుంబాలను దత్తత తీసుకుని, వారిని సామాజిక, ఆర్థిక స్థితి మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ధర్మసమాజ్ సభ్యులు గురుమూర్తి, తేజ, మోహన్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు అవసరం


మొక్కలు నాటుతున్న దృశ్యం

గుర్రంకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానంద రెడ్డి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం తరిగొండ జడ్పీ హైస్కూల్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాలి ప్రశాంతంగా జీవనం సాగించాలంటే స్వచ్ఛమైన గాలి అవసరమన్నారు. అందుకు గానూ ప్రతి ఒక్కరు చెట్లను నాటి వాతావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, చంద్రబాబు, నరసింహులు, చలమారెడ్డి, సుదర్శన్, హెచ్‌ఎం. రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా బంగారు కుటుంబాల ఎంపిక

పెద్దమండ్యం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా బంగారు కుటుంబాలు ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం కలిచెర్ల కోటగాడపల్లెలో పీ-4 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు కుటుంబాల ఎంపికకు కేటాయించిన అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. పేదలు అభివృద్ధి సాధించడం కోసం ప్రభుత్వం పీ-4 అమలు చేసిందన్నారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు తేజశ్వి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మురికి కూపంగా సత్యవతి నది..!

● నదిలో కలుస్తున్న ఊరి డ్రైనేజీ
● చికెన్ వ్యర్థాలతో కలుషితం
● దోమల బెడదతో స్థానికుల ఆవేదన


కలకడ సత్యవతి నదిలో పారుతున్న మురికి నీరు

కలకడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలకడ సమీపంలో ప్రవహించే సత్యవతి నది మురికి కూపంగా మారింది. అందులోకి ఊరి డ్రైనేజీ కలిసి పారుతుండడంతో పాటు కొందరు చెత్తచెదారంను పడేస్తున్నారు. దీనికితోడు వ్యాపారులు బ్రిడ్జిపై నుంచి చికెన్ వ్యర్థాలను తెచ్చి వేస్తుండడంతో కలుషితంగా మారుతుంది నదిలో గుంతలు పడడంతో మురికి నీటికి వర్షపు నీరు తోడవుతుంది. బురదలో పందులు పొర్లాడి చుట్టుపక్కల భరించరాని దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పారిశుధ్యం లోపించి దోమల బెడద ఎక్కువై ఆనారోగ్యం బారీన పడాల్సివస్తోందని స్థానికులు భయపడుతున్నారు. అంతేకాక నదిలో కంపచెట్లు, కాకి వెదురులతో నిండి చిట్టడవి తలపిస్తోంది. వర్షాలకు ప్రవాహం అధికమైనపుడు నీటీ పారుదల ఝరి కోనకు చేరుతోంది. అక్కడ నుంచి పంపింగ్ ద్వారా కలికిరి, కేవీపల్లి, కలకడ మండలలాలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ఆ నీరు తాగి ప్రజలు వ్యాధుల బారీన పడే ప్రమాదముంది. కాగా నది జాతీయ రహదారిపై ఉండడంతో బ్రిడ్జిపై ప్రయాణం చేసే వాహనదారులు, నడుచుకు వెళ్లె ప్రజలు ముక్కు మూసుకొనే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. గతంలో సమస్య తీవ్రత గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇంచార్జి ఎంపీడీఓ జగదీశ్వర్‌ను వివరణ కోరగా పారిశుధ్యం మెరుగుకు తగు చర్యలు తీసుకుంటాం. సత్యవతి నదిలో చెత్తచెదారం చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.


నదిలో పడేసిన చికెన్ వ్యర్థాలు

ఎస్సీ, ఎస్టీ సమావేశాలంటే అధికారులకు చులకనా ?

● పౌరహక్కుల సమావేశంలో దళిత నాయకులు


ఎస్సీ, ఎస్టీ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సమావేశాలంటే అధికారులకు చులకనాభావం ఎందుకని దళిత నాయకులు మునిరత్నం, రాజన్నలు అధికారులను ప్రశ్నించారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతి దేవిరెడ్డిగారిపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ సిరాజ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు కూడా అధికారులు హాజరుకాకపోతే తమ సమస్యలను ఎలా తీరుస్తారన్నారు. అలాగే రోడ్డు ఇరువైపులా వున్న పచ్చని చెట్లను నరికి వేసి ఇష్టారాజ్యంగా స్తంభాలను వేయండంపై అభ్యతరం తెలిపారు. అదే విధంగా పలు గ్రామాల్లో మురుగునీటి కాలువలు విద్యుత్‌దీపాలు, వంటి సౌకర్యాలు కల్పించలేదని తెలిపారు. అనంతనం డీటీ సిరాజ్ మాట్లాడుతూ ప్రతి నెల ఒక గ్రామంలో సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించి దళితవాడల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత వరకు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అయితే సమావేశానికి తహసీల్దార్, ఎంపీడీవో, డాక్టర్లు, ట్రాన్స్‌కో ఏఈ, ఏపీఎం తదితరులు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. హాజరుకాని మండల అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, ఎంఈవో-2 నారాయణ, సర్వేయర్ గోపి, ఏపీఎం మురళి, దళిత నాయకులు రెడ్డినారాయణ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

వాల్మీకిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు విధిగా ఇవ్వాలని ఎంపీడీవో మనోహర్‌రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స.హ.చట్టం 2005 ప్రాముఖ్యతను అధికారులు గుర్తించాలని, అదేవిధంగా చట్టం అమలులో బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి


విగ్రహాలను పరిశీలిస్తున్న రాంప్రసాద్ రెడ్డి

పీలేరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గాలివారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ సమేత అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమంలో బుధవారం రాత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి గ్రామప్రజలు పెద్దఎత్తున బాణాసంచా పేలుళ్లు, మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పీలేరు బీజేపీ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఎంపీటీసీ గాలి లక్ష్మి, ముప్పవరపు ఛారిటబుల్ ట్రస్టు అధినేత, ఎన్ఆర్ఐ నాగరాజునాయుడు, తెలుగు యువత నాయకుడు గాలి నవీన్, గాలి రాజగోపాల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ సమన్వయకర్తగా నారాయణ


నియామకపత్రం అందుకుంటున్న నారాయణ

పీలేరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాయలసీమ సమన్వయకర్తగా పీలేరుకు చెందిన దళిత నేత గుర్రం నారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఉప్పులేటి దేవిప్రసాద్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ అణగారిన దళిత, బహుజనవర్గాలకు సమాన అవకాశాలు కల్పించి సామాజిక సమానత్వం కోసం పాటుపడతామన్నారు.

మిట్స్ విశ్వవిద్యాలయానికి అక్రిడిటేషన్ గుర్తింపు


అక్రిడిటేషన్ గుర్తింపును ప్రదర్శిస్తున్న విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని మిట్స్ విశ్వవిద్యాలయానికి అక్రిడిటేషన్ గుర్తింపు దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. దీంతో విశ్వవిద్యాలయంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు మూడేళ్ల పాటు గుర్తింపు దక్కినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యాప్రమాణాలు, ఫలితాల ఆధారిత అభ్యసనానికి గుర్తింపుగా ఈ అవకాశం దక్కిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో సీఎస్ఈ, మెకానికల్, సివిల్, ఈఈఈ, ఈసీఈ, పీజీ విభాగంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాలకు గుర్తింపు దక్కిందన్నారు. కాగా ఈ గుర్తింపు 2028 జూన్ 30 వరకు ఉంటుందన్నారు. విద్యార్థులకు వసతులతోపాటు మెరుగైన విద్యాప్రమాణాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ గుర్తింపు రావడంతో కళాశాల యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమం విస్మరించిన వైసీపీ

వాల్మీకిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతికి ఆజ్యం పోసిందని పీలేరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యాలయంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యలపై విన్నవించగా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, శేషాద్రిరెడ్డి, జాఫర్, డిష్ బ్రదర్స్, తదితర కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

పెద్దతిప్పసముద్రం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఎటువంటి ఆసరా లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ఆర్థికంగా చేయూత అందించడమే పీ-4 లక్ష్యమని తహీల్దారు శ్రీరాములునాయక్ అన్నారు. సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని, కలెక్టరు ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. బుధవారం మండలంలోని రంగసముద్రంలో పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి, వీఆర్వో రామకృష్ణ, గ్రామ సర్పంచ్ శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సుజాత సుబ్రమణ్యం, ఎఫ్‌పీవో చైర్మన్ నాగరాజుతో కలసి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి కుటుంబ స్థితిగతులు తెలుసుకుని వివరాలను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

మదనపల్లెటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహిళలను, టీనేజి బాలికలను, చిన్నారులకు మోసపూరిత మాటలు చెప్పి, వారిని అక్రమ రవాణా చేసే దుండగుల మాటలు నమ్మవద్దని పోర్డు సంస్థ డైరెక్టర్ జె.లలితమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లలితమ్మ మాట్లాడుతూ పేదలను టార్గెట్‌గా తీసుకుని వారికి పలు రకాల ఆశలు చూపించి కొందరు లొంగదీసుకుని ముంబై, తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తారన్నారు. ఇలాంటి వారిని గుర్తించిన వెంటనే ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, న్యాయవాది రమాదేవి, ఏఎస్ఐ రమణ, అధ్యాపకులు వనజ, ఖాజావలి, శ్రీనివాసులు, జ్యోతి, మోహనవల్లి, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఉద్యమ్' రిజిస్ట్రేషన్ తప్పనిసరి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి

పీలేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) స్వయం ఉపాధి రుణాలు, పరిశ్రమల కోసం 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణ కిశోర్ పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాలను సులభతరం చేయడమే కాకుండా ఎంఎస్ఎంఈలన్నింటినీ ఒకే వేదిక కింద చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. ప్రతి పరిశ్రమకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ శాశ్వత గుర్తింపు సంఖ్య ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు నాగార్జున, శంకరప్ప, పీలేరు ఎంపీడీవో శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

● టీడీపీ సీనియర్ నాయకుడు కమలామరి కృష్ణ

మదనపల్లె అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యున్నతికి చిత్తశుద్ధితలో పనిచేస్తున్నామని, రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక గిట్టని వారు కొందరు సోషియల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు కమలామరి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 2023లో నిర్వహించిన యువగళం పాదయాత్రలో తాను పార్టీలోకి వచ్చినప్పటి నుంచి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా కడపలో నిర్వహించిన మహానాడుకు వార్డు నుంచి ఎక్కువగా నాయకులు, కార్యకర్తలు తరలించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సహకారంతో అభివృద్ధి కార్యక్రాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇది చూసి ఓర్వలేక తనపై బురద చల్లే కార్యక్రమం మొదలు పెట్టారన్నారు. కార్యక్రమంలో రెడ్డికేశవ, గడ్డం సురేష్, గణేష్, రెడ్డిశేఖర్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే ధ్యేయం'

పెద్దమండ్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పెద్దమండ్యం టీడీపీ క్లస్టర్ ఇంచార్జి యుగంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దమండ్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీటెక్ సుమన్, మాజీ సర్పంచ్ నాగార్జున, ఫరూక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

బి.కొత్తకోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. రంగసముద్రంలోని ఆదిత్య కళాశాల వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు సన్‌బిజ్, యఫ్‌సీయల్, ఆధ్య, హెచ్‌ఆర్ సొల్యూషన్స్ లాంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. నిరుద్యోగులు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

12 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు

నిమ్మనపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 పాఠశాలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షిస్తున్నట్లు ఎంఈవో-1 పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె వెంగంవారిపల్లి, నిమ్మనపల్లి, బండ్లపై సామకోటవారిపల్లిల్లోని కిచెన్ గార్డన్‌లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 12 పాఠశాలల్లో కిచెన్ గార్డన్ ఏర్పాటుకు రూ.5 వేలు కేటాయించిదని తెలిపారు. కిచెన్ గార్డెన్ ముఖ్య ఉద్దేశం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి వాటిలో కాసిన కూరగాయలతో మధ్యాహ్న భోజనం చేయాలని తెలిపారు. ఇప్పటికే 12 పాఠశాల్లో కూరగాయల మొక్కలు నాటినట్లు తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

నిమ్మనపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు తప్పవని ఏవో సుజాత పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎరువుల దుకాణాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టాకు రిజిష్టరు, ధరల పట్టిక, వేయింగ్ మిషన్‌ను తనిఖీలు చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని, కొరత రూపంలో అధిక ధరలకు విక్రయిస్తే అలాంటి దుకాణాలను సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే మండల రైతులకు మాత్రమే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ములకలచెరువు: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రదీప్, ఏవో స్రవంతి హెచ్చరించారు. ములకలచెరువులోని ఎరువులు, పురుగుల మందు విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్ సృష్టించి ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ : డీఎం

పీలేరురూరల్, జూలై 30: ఏపీఎస్ ఆర్టీసీ పీలేరు డిపోలో ఆన్ కాల్ డ్రైవర్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎం నిర్మల తెలిపారు. బుధవారం ఆమె పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభ్యర్థులు 21 ఏళ్ల పైబడి 40 లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. హెవీ లైసెన్స్‌తో పాటు 18 నెలలు అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఆర్టీఏ క్లియరెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరన్నారు. అర్హులైన అభ్యర్థులు డిపో మేనేజర్ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు

మదనపల్లె అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ డిపో పరిధిలో ఆదర్శ ఉద్యోగులను అభినందిస్తున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు కలిసికట్టుగా పని చేసి డిపో అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రతిఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. ఇప్పటికి మదనపల్లె వన్‌డిపో ఉద్యోగులు సమయస్ఫూర్తితో మెలిగి రీజియన్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. ఇందుకు ఆర్టీసీ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రేవతి, ఎంఎఫ్ రవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

20 కుర్చీల వితరణ

పీలేరురూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రానికి పీలేరు ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిశోర్ నాయుడు రూ.15 వేలు విలువైన 20 కుర్చీలను అందజేశారు. ఆరోగ్య ఉపకేంద్రంలో కనీస వసతులు లేనందున రోగులు ఇబ్బంది పడుతున్నారని కేంద్ర సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తన ఔదార్యం చాటుతూ కుర్చీలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ దొడ్డిపల్లె ఇన్‌చార్జి నారే సతీష్‌కుమార్‌రెడ్డి, టి.రెడ్డెప్ప, జి.నాగరాజ, గోళ్ల సునీల్, వేణుగోపాల్, సురేష్, వైద్యసిబ్బంది పి.అమ్మాజీ, రమాదేవి పాల్గొన్నారు.


ఆరోగ్య ఉపకేంద్రానికి కుర్చీలు అందజేస్తున్న దృశ్యం